www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 8 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

Published from: Karimnagar, Circulated to : Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar

హైదరాబాద్ | సంపుటి : 02 సంచిక : 235 | ఆదివారం | 9 ఫిబ్రవరి, 2025



## అవినీతి కారణంగానే ఆప్ ఓటమి

అవినీతిని సహించమని తేల్చి చెప్పిన ఢిల్లీ ప్రజలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

.. వివరాలు 4లో



## ఇక ఆ బీరు బంద్..

కింగ్‌ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటన

ప్రభుత్వం బేస్ ధర పెంచకపోవడంతో నష్టాలు అంటూ కంపెనీ వెల్లడి

.. వివరాలు 2లో




# ఢిల్లీ పీఠంపై కమలదళం

### ఆప్‌ను ఊడ్చి పారేసిన రాజధాని ఢిల్లీ ప్రజలు

- ఇక డబుల్ ఇంజన్ సర్కార్‌కు రంగం సిద్ధం
- జైలుకెళ్లిన ఆప్ నేతలంతా ఓటమి
- పర్వేశ్ సింగ్ వర్మ చేతిలో కేజ్రీవాల్ పరాజయం
- చివరి రౌండులో బయటపడ్డ సిఎం అతిషి
- ఖాతా కూడా తెరవని కాంగ్రెస్ పార్టీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘోర పరాజయం పాలైంది. రెండున్నర దశాబ్దాల సుదీర్ఘ విరామం తరవాత బిజెపి అక్కడ అధికారం చేపట్టబోతోంది. అవినతిని ఏడ్చేస్తానంటూ గద్దెనెక్కిన ఆప్‌ను ప్రజలు ఊడ్చి అవతల పడేశారు. ఈ నెల 5న జరిగిన ఎన్నికలకు సంబంధించి శనివారం ఓట్ల లెక్కింపు జరిగింది. 70 సీట్లకు గాను బిజెపి మ్యాజిక్ ఫిగర్‌ను దాటి 47 సీట్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలే కౌంటింగ్‌లో కనిపించాయి. కాంగ్రెస్ ఎక్కడా ఖాతా తెరవలేదు. పోటీ బిజెపి, ఆప్ మద్యే జరిగినట్లు ఫలితాలు వెల్లడించాయి. మొత్తంగా డబుల్

మిగతా 2 లో

## కాగజ్‌నగర్‌ను మహారాష్ట్రలో కలపాలా?

### బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలు దారుణం

- క్షేత్రస్థాయిలో స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి
- ఆర్ఎస్ ప్రవీణ్ కష్టకాలంలో మనతో కలిశారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో కాగజ్‌నగర్ కార్యకర్తల భేటీ



సిర్పూర్ కాగజ్ నగర్‌ను మహారాష్ట్రలో కలప మని అక్కడి బీజేపీ ఎమ్మెల్యే సోయిలేకుండా మాట్లాడుతున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. కాగజ్ నగర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మనసులో ఉన్న మాట తనకు అర్థమైందని.. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పై ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకొని వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని పిలుపునిచ్చారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 8:** బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్క కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్న మనపార్టీతో కలిసి నడిచేందుకు ముందుకు వచ్చిన నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ సమాజం గురించి..

మిగతా 4 లో



## త్వరలోనే పట్టాలెక్కనున్న వందేభారత్ స్లీపర్ రైళ్లు

### కసరత్తు చేస్తున్న రైల్వే శాఖ

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 8 :** భారతీయ రైల్వే ప్రతిష్టాత్మ కంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెడుతున్నది. ఇప్పటికే పలుమార్గాల్లో సెమి హైస్పీడ్ రైళ్లు పరుగులు పెడుతున్నాయి. త్వరలోనే వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలు

మిగతా 2 లో

## ఇది ఢిల్లీ ప్రజలకు పండగ రోజే

### ఢిల్లీ ప్రజల భవిష్యత్తు మోదీ గ్యారంటీ

### జీరోతో పోటీపడ్డ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ

### బీజేపీ విజయోత్సవ సభలో మోడీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** ఆప్, కేజీవ్రాల్ నుంచి ఢిల్లీ ప్రజలకు విముక్తి లభించిందని ప్రధాని మోదీ అన్నా రు. ఇది ఢిల్లీ ప్రజలకు పండగ రోజని అన్నారు. ఇం తటి విజయం అందించిన ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీ ప్రజలను ప్రేమను అభివృద్ధిలో చూపి స్తామన్నారు. ఢిల్లీలో బీజేపీ విజయం సామాన్యమైనది కాదు.. ఢిల్లీ వికాస్, విజన్ కోసం ముందుకెళ్తామ న్నారు. ఢిల్లీ ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తెచ్చు కున్నారు. ఢిల్లీ ప్రజల సేవకోసమే బీజేపీ ఉన్నదని అన్నారు. ఢిల్లీ ప్రజల భవిష్యత్తు మోదీ గ్యారంటీ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించిన విషయం తెలిసిందే. మొత్తం 70కిపైగా అసెంబ్లీ స్థానాలకు బీజేపీ48 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది.

మిగతా 3 లో



## పెండింగ్‌లో ఉన్న 408.40 కోట్లు చెల్లించండి

మా రాష్ట్ర నిధులను విడుదల చేయండి

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు భట్టి వినతి

02



## ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులకు బ్రేక్‌పై ఈసీ వివరణ

ఫేక్ ప్రచారానికి బ్రేక్




02



## టీపీఎల్‌కు సై

- ప్రతి జిల్లాకు రూ.కోటి డెవలప్‌మెంట్ ఫండ్
- పదెకరాల విస్తీర్ణంలో స్టేడియాల అభివృద్ధి
- మార్చిలో ఏజీఎం, హెచ్‌సీఏ అవార్డ్స్ వేడుక
- ఉప్పల్ స్టేడియంలో ఆధునీకరణ పనులు
- హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలను

వెల్లడించిన అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

07

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# ఢిల్లీ పీఠంపై కమలదళం



మొదటి పేజీ తరువాయి

ఇంజన్ సర్కార్ ఏర్పడబోతోంది. ఫలితాలపై బిజెపి హర్షం వ్యక్తం చేయగా, ప్రజల తీర్పును స్వాగతిస్తున్నట్లు అరవింద్ కేజ్రీవాల్ప్రకటించారు. ఇకపోతే ఫలితాల తీరును గమనిస్తే..ముఖ్యంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఎఫెక్ట్ ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. ఆప్ కీలక నేతలంతా ఒక్కొక్కరుగా ఓటమి పాలయ్యారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సహా మనీష్ సిసోడియా, సత్యేందర్ జైన్, సోమనాథ్ భారతి వంటి కీలక నేతలు ఓడిపోయారు. లిక్కర్ స్కామ్లో జైలుకెళ్లిన కేజ్రీవాల్, సిసోడియా, సత్యేందర్ జైన్ ఓడిపోవడం గమనార్హం. సాధారణంగా జైలుకు వెళ్లి వచ్చిన ఏ నాయకుడికైనా సానుభూతి వస్తుంది, అయితే ఢిల్లీ ఓటర్లు మాత్రం లిక్కర్ స్కామ్లో వీరి హస్తం ఉందని భావించినట్లు ఉన్నారు. అందుకే ముగ్గురిని కూడా చావుదెబ్బ తీశారు. తనను కావాలనే బీజేపీ టార్గెట్ చేస్తోందని కేజ్రీవాల్ పదేపదే ఆరోపించినప్పటికీ ఢిల్లీ ఓటర్లు నమ్మలేదు. లిక్కర్ స్కామ్కి తోడు శీష్ మహల్, ప్రభుత్వ వ్యతిరేకత, మధ్య తరగతి వర్గాలు బీజేపీ వైపు వెళ్లడం ఇవన్నీ ఆప్ ఓటమికి కారణమని చెప్పవచ్చు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ని విచారిస్తున్న సీబీఐ, ఈడీలు ఈ కేసులో ఆప్ నేతల్ని అరెస్ట్ చేశారు. బెయిల్పై బయటకు వచ్చిన కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేసి, అతిశీ మార్లెనాకు ఢిల్లీ పగ్గాలు అప్పగించి, అనధికార సీఎంగా పనిచేశారనే వాదనలు ఉన్నాయి. అయితే, తన నిజాయితీని ఢిల్లీ ప్రజలు నమ్ముతారని, మళ్లీ తననే అధికారంలోకి తీసుకువస్తారని కేజ్రీవాల్ భావించారు. తన నిజాయితీకి అసెంబ్లీ ఎన్నికలు రెఫరెండం అని, తనను కాపాడే బాధ్యత ఢిల్లీ ఓటర్లదే అని సెంటిమెంట్ కామెంట్స్ చేశారు. అయినా కూడా జైలుకు వెళ్లి వచ్చిన ముగ్గురు నేతలకు ఓటమి తప్పలేదు. ఇకపోతే కేజ్రీవాల్ను మాజీ సిఎం సాహిబ్సింగ్ వర్మ కుమారుడు బీజేపీ అభ్యర్థి పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ ఓడించి సంచలనం సృష్టించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను నిజం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు భాజపాకు పట్టం కట్టారు. ఘన విజయాన్ని అందించారు. కమలదళం హోరులో.. గత మూడు పర్యాయాలు అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కొట్టుకుపోయింది. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా మ్యాజిక్ ఫిగర్ (36)ను దాటి 43 స్థానాలకు విజయం సాధించింది. మరో 5 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. అంటే 48 స్థానాల్లో కమలం హవా కనబర్చింది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలనుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆశలకు భాజపా గండికొట్టింది. అంతేకాదు.. ఆప్ అధినేత కేజ్రీవాల్ సహా పలువురు పార్టీ పెద్దలకూ ఓటమి తప్పలేదు. ఫలితాల్లో ఆప్ 19 చోట్ల విజయం సాధించింది. మరో 3 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోంది. మొత్తంగా 22 స్థానాలకు పరిమితమైంది. ఇక, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లోనూ ఏ మాత్రం ప్రభావం చూపించలేక పోయింది. కనీసం ఒక్క స్థానంలోనూ ఆధిక్యం సాధించలేకపోయింది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ న్యూఢిల్లీ స్థానం నుంచి ఓటమి చవిచూశారు. భాజపా అభ్యర్థి పర్వేశ్ వర్మ చేతిలో 4,089 ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. ఇదే స్థానంలో పోటీ చేసిన మాజీ సీఎం షీలా దీక్షిత్ తనయుడు సందీప్ దీక్షిత్కు 4,568 ఓట్లు రావడం గమనార్హం. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోదియా జంగ్పురాలో విజయం దక్కలేదు. తన సమీప భాజపా అభ్యర్థి తర్వీందర్ సింగ్ చేతిలో కేవలం 675 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ.. కాల్కాజీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆది నుంచి వెనుకంజలో ఉన్న ఆమె చివరి రౌండ్లలో అనూహ్యంగా పుంజుకున్నారు. భాజపా అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆప్ సీనియర్ నేత సత్యేంద్ర జైన్ షాకూరి బస్తీలో ఓటమిపాలయ్యారు. ఇక్కడ భాజపా అభ్యర్థి కర్నాల్ సింగ్ 20,998 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాష్ స్థానంలో పరాజయం పాలయ్యారు. ఈ స్థానంలో భాజపా నాయకురాలు శిఖా రాయ్ 3,188 ఓట్ల తేడాతో నెగ్గారు. బిజ్వాసన్ నియోజకవర్గం నుంచి భాజపా నేత కైలాశ్ గెహ్లోత్ విజయం సాధించారు. తన సమీప ఆప్ అభ్యర్థి సురేందర్ భరద్వాజ్పై 9,833 ఓట్లతో గెలుపొందారు. భాజపా నేత అర్విందర్ సింగ్ లవ్లీ గాంధీ నగర్లో విజయం సాధించారు. ఆప్ అభ్యర్థిపై 12,748 ఓట్ల మెజార్టీతో నెగ్గారు.

## స్థానిక ఎన్నికలకు స్పీడ్ పెంచిన
# ఎన్నికల సంఘం

**జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్ల ఎంపిక**




**హైదరాబాద్,ఫిబ్రవరి 8:** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే క్రమంలో ఎన్నికల సంఘం స్పీడ్ను పెంచింది. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాకు పది మంది చొప్పున మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్లను ఎంపిక చేసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ పంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు రాష్ట్ర ఎన్నికల సంఘం శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, స్టేట్ రిసోర్స్ పర్సన్లకు ఎంసీహెచ్ఆర్డీలో ఎన్నికల సంఘం ట్రైనింగ్ ఇచ్చింది. జిల్లా కలెక్టర్లకు తెలంగాణ ఎలక్షన్ కమిషన్, కీలక ఆదేశాలు జారీ చేసింది. మండల, జిల్లా పరిషత్, పంచాయతీ రిటర్నింగ్ అధికారులను ఫిబ్రవరి 10వ తేదీ లోపు ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించింది. పంచాయితీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం ఎంపిక చేసిన రిటర్నింగ్ అధికారులకు ఫిబ్రవరి 12లోపు శిక్షణ పూర్తి కావాలని తెలిపింది. పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు ఈ నెల 15లోపు శిక్షణ పూర్తి చేయాలని సూచించింది. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్తో శిక్షణ పూర్తి చేయాలని తెలంగాణ ఎలక్షన్ కమిషన్ ఆదేశించింది.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# బీఆర్ఎస్ ఫోకస్




**హైదరాబాద్,ఫిబ్రవరి 8 :** స్థానిక సంస్థల ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. లోకల్ బాడీ ఎన్నికలకు కేడర్ను గులాబీ పార్టీ సిద్ధం చేస్తోంది. శనివారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్లో వికారాబాద్ జిల్లా నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై కేడర్కు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని గులాబీ పార్టీ పట్టుదలతో ఉంది. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా బీఆర్ఎస్ ఉంది. ఈ నేపథ్యంలో గ్రామాలను ప్రభావితం చేసే స్థానిక సంస్థల ఎన్నికలపై కారు పార్టీ దృష్టి సారించింది. మాజీమంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బీసీ నేతల సమావేశం ఆదివారం జరగనుంది. ఆదివారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. బీసీల కులగణనతోపాటు ప్రస్తుత రాజకీయాలపై బీఆర్ఎస్ తరఫున కార్యాచరణ ప్రకటించే అవకాశం ఉంది.

# త్వరలోనే పట్టాలెక్కనున్న వందేభారత్ స్లీపర్ రైళ్లు

మొదటి పేజీ తరువాయి

ఎక్కించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది. సుదూర ప్రయాణాల్లో విప్లవాత్మక మార్పులను వందే భారత్ స్లీపర్ రైలు తీసుకువస్తుందని రైల్వేశాఖ పేర్కొంది. రీసెర్చ్ డిజైన్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ తొలి వందే భారత్ స్లీపర్ ముంబయి- అహ్మదాబాద్ మార్గంలో 540 కిలోమీటర్ల దూరం ట్రయల్ రన్ను విజయవంతంగా నిర్వహించింది. 16 కోచ్లతో రైలు పరుగులు తీసింది. త్వరలోనే తొలి వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించేందుకు రైల్వేశాఖ కసరత్తు చేస్తున్నది. ట్రయల్ రన్కు సంబంధించిన డేటాను విశ్లేషించిన అనంతరం ఆర్డీఎస్ఓ ÷నైల్ ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నది. రైల్వే సేఫ్టీ కమిషనర్ రైలును గరిష్ఠ వేగాన్ని పరిశీలించనున్నారు. ఈ ఏడాది జనవరి తొలివారం రైలు కోటాలో 30-40 కిలోమీటర్ల స్వల్ప దూరంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సమయంలో రైలు 180 కిలోమీటర్ల వేగంతో దూసుకుని వెళ్లింది. వందే భారత్ స్లీపర్ రైళ్లు రాబోయే కాలంలో రాత్రి ప్రయాణాన్ని పునర్నిర్వహించబోతున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రోటోటైప్ విజయవంతమైన ట్రయల్ రన్ పూర్తి చేసిందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది మరో తొమ్మిది వందే భారత్ ట్రైన్ సెట్స్ను ఉత్పత్తి చేయాలని రైల్వేశాఖ భావిస్తుంది. ఏప్రిల్, డిసెంబర్ మధ్య ఐసీఎఫ్ డెలివరీ చేయనున్నది. ఈ రైలులో మూడు కేటగిరిలు అందుబాటులో ఉంటాయి. ఇందులో ఏపీ ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాస్ ఏసీ, ఏసీ త్రీ టైర్ అందుబాటులో ఉంటాయి. మొత్తం 1,128 బెర్తులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. గత నెలలో భారతీయ రైల్వేశాఖ 24 వందే భారత్ స్లీపర్ రైలు 50 రేకుల కోసం ఆర్డర్ వచ్చింది. రాబోయే రెండేళ్లలో సిద్ధమయ్యే అవకాశం ఉంది. 2026-27 సంవత్సరంలో 24 సెట్స్ ఉత్పత్తి కానున్నాయి. ఇది రైల్వే టెక్నాలజీలో భారత్ స్వావలంభనను మరింత బలోపేతం చేస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## రూపాయి విలువను నిర్ణయించేది
# మార్కెట్ శక్తులే

**ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 8:** డాలరుతో రూపాయి విలువను మార్కెట్ శక్తులు నిర్ణయిస్తాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. దేశీయ కరెన్సీ రూపాయి విలువ క్షీణించడంపై సంజయ్ మల్హోత్రా స్పందించారు. రూపాయి విలువ రోజువారీ మార్పులపై ఆర్బీఐ పెద్దగా ఆందళన చెందబోదని తెలిపారు. దీర్ఘకాల, మధ్యస్థ కాలంలో రూపాయి విలువ మార్పుపైనే ఆర్బీఐ దృష్టి సారిస్తుందని చెప్పారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తో భేటీ అనంతరం ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. డాలరుతో రూపాయి మారకం విలువ 87.50గా ఉంది. ఆర్బీఐ తాజాగా 25 బేసిస్ పాయింట్ల మేర రెపోరేటును సవరించిన నేపథ్యంలో 9 పైసలు మేర బలపడింది. ఈ నేపథ్యంలో మీడియా ప్రతినిధుల నుంచి రూపాయి పతనంపై ప్రశ్న ఎదురవ్వగా.. ఆర్బీఐ గవర్నర్ స్పందించారు. 'రూపాయి విషయంలో ఆర్బీఐ వైఖరిలో ఎలాంటి మార్పూ లేదు. రూపాయి విలువ స్థాయిని గానీ, ఒక బ్యాండ్ను గానీ మేం చూడబోం. ఎప్పుడైన భారీ స్థాయిలో ఒడుదొడుకులు ఎదుర్కొంటే జోక్యం చేసుకుంటాం. రోజువారీ విలువ తగ్గడం, పెరగడం గురించి పట్టించుకోం' అని గవర్నర్ పేర్కొన్నారు. రూపాయి విలువ 5 శాతం క్షీణిస్తే దేశీయంగా ద్రవ్యోల్బణం 30-35 బేసిస్ పాయింట్ల మేర ప్రభావం పడుతుందని మల్హోత్రా చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి, వృద్ధి ద్రవ్యోల్బణ అంచనాలను రూపొందించినప్పుడు ప్రస్తుత డాలరు- రూపాయి విలువను పరిగణనలోకి తీసుకున్నామన్నారు. అంతర్జాతీయ పరిణామాల వల్లే రూపాయి వల్లే రూపాయి విలువ క్షీణిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలపై చేస్తున్న ప్రకటనలు ఇందుకు కారణమవుతున్నాయని చెప్పారు. త్వరలోనే దీనికో పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇది దేశీయంగా ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడానికి దోహదపడుతుందన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని పెంచేందుకు చాలా అస్త్రాలు తమ వద్ద ఉన్నాయని, అవసరం అయినప్పుడు వినియోగిస్తామన్నారు.

# రూ.408.40 కోట్లు చెల్లించండి

**ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్కు భట్టి వినతి**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 8:** తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ను భట్టి విక్రమార్క మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర ఆర్థికమంత్రిని ఢిల్లీ సఫ్దర్ జంగ్ రోడ్డులోని ఆమె అధికారిక నివాసంలో డిప్యూటీ సీఎం కలిశారు. గతంలోనూ ఈ అంశాలకు సంబంధించి కేంద్రానికి రాసిన లేఖలను సైతం నిర్మలా సీతారామన్కు అందజేశారు. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని పలు అంశాలపైనా చర్చ జరిగింది. వివిధ కార్పొరేషన్ల ఋణ పునర్వ్యవస్థీకరణపై ఆర్థిక సంస్థలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సిందిగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ని భట్టి కోరారు. తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.408.40 కోట్లు తిరిగి చెల్లించేలా పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 విభాగం 94(2) ప్రకారం, వెనకబాటు జిల్లాల కోసం తెలంగాణకు ప్రత్యేక సహాయ నిధి విడుదల చేయాలని భట్టి కోరారు. ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని విభాగం 56(2) ప్రకారం, రూ.208.24 కోట్లు తెలంగాణకు తిరిగి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధప్రదేశ్ పవర్ ÷నాన్స్ కార్పొరేషన్ నుంచి తెలంగాణ పవర్ ÷నాన్స్ కార్పొరేషన్కు కేటాయించిన అదనపు బాధ్యత మేరకు రావాల్సిన మొత్తానికి సంబంధించిన అంశంపైనా చర్చ సాగింది. ఆంధప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 కింద నిధుల బదిలీ కోరుతూ కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధప్రదేశ్, తెలంగాణ పవర్ యుటిలిటీల మధ్య పెండింగ్లో ఉన్న బకాయిల పరిష్కారం చేయాలని కోరారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం నుంచి ప్రాయోజిత పథకాల నిధుల విడుదలలో జరిగిన కేటాయింపు పొరపాటును సరిచేయాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్ తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ ప్రజలు అభివృద్ధి కోసం
# బిజెపికి ఓటేశారు

**వారికి సెల్యూట్ చేస్తున్నా...ప్రధాని మోడీ వెల్లడి**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8:** ఢిల్లీ ఓటర్లు అభివృద్ధి కోరుకుంటున్నారని, అందుకే బిజెపికి పట్టం కట్టారని, ఇక అభివృద్ధి బాధ్యత తమదని ప్రధాని మోడీ అన్నారు. 27 ఏళ్లపాటు కాంగ్రెస్, ఆమ్ఆద్మీపార్టీ పాలన చూసిన ఢిల్లీ ఓటర్లు ఈసారి భాజపా కు అవకాశం ఇచ్చారు. కమలం పార్టీకి భారీ విజయాన్ని కట్టబెట్టారు. అందుకుగానూ ప్రధాని మోడీ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఢిల్లీ ఓటర్లకు సెల్యూట్ అంటూ ఎక్స్ వేదికగా సంతోషం వ్యక్తంచేశారు. భాజపాకు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టిన సోదరసోదరీమణులకు అభినందనలు తెలియజేశారు. ఇక అభివృద్ధి తమ గ్యారంటీ అన్నారు. 'అభివృద్ధి, సుపరిపాలన విజయం సాధించాయి. ఈ భారీ విజయం కోసం నిర్విరామంగా పనిచేసిన కార్యకర్తల పట్ల గర్వంగా ఉంది. ఢిల్లీ అభివృద్ధికి, ప్రజల జీవితాలు మెరుగుపరచడానికి అహర్నిశలు శ్రమిస్తామని హామీ ఇస్తున్నాం. అలాగే భారత్ అభివృద్ధిలో ఢిల్లీ ముఖ్యపాత్ర పోషించనుంది. ఇక్కడ ప్రజలకు సేవ చేయడానికి అంకితభావంతో ముందుకు వెళతాం' అని మోదీ తన పోస్టులో పేర్కొన్నారు. 70 స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరిగాయి. ఎగ్జిట్పోల్స్ అంచనాలను నిజం చేస్తూ అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ఓటర్లు భాజపాకు పట్టం కట్టారు. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో భాజపా మ్యాజిక్ ఫిగర్ దాటేసింది. వరుసగా నాలుగోసారి అధికారంలోకి రావాలనుకున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆశలకు భాజపా గండికొట్టింది.

# ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు

**కొత్త రేషన్కార్డుల దరఖాస్తులకు బ్రేక్పై ఈసీ వివరణ**




**హైదరాబాద్, ఫిబ్రవరి 8:** కొత్త రేషన్ కార్డులు, కొత్త రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఎన్నికల కమిషన్ బ్రేక్ వేసిందన్న ప్రచారంతో గందరగోళం నెలకొంది. మీ సేవలో దరఖాస్తు చేసుకునే అవకాశానికి ఇసి బ్రేక్ వేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 41 లక్షల కొత్త రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించిన విషయం తెలిసిందే.. కొత్త రేషన్ కార్డులు, పాత కార్డుల్లో మార్పులు చేర్పులకు మీ సేవా ద్వారా దరఖాస్తులు పెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది నిరంతర పక్రియ అని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఇసి బ్రేక్ వేసిందని వార్తలు ప్రచారం జరిగాయి. గతంలో ప్రజాపాలన సదస్సులు ఇటీవల జరిగిన గ్రామ, వార్డు సభల్లో భారీగా దరఖాస్తులు అందాయి. హైదరాబాద్ ప్రజాభవన్తో పాటు జిల్లాల్లో ప్రజావాణి కార్యక్రమం లోనూ దరఖాస్తులు వస్తున్నాయి. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించాలని డుప్లికేట్ లేకుండా అర్హులకు అందేందుకు వీలుంటుందని పౌరసరఫరాల శాఖ పేర్కొంది. అయితే తెలంగాణ రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి బ్రేక్ వేసినట్లు వస్తున్న వార్తలు, సోషల్ మీడియాలో ప్రచారంపై ఎన్నికల సంఘం వివరణ ఇచ్చింది. అలాంటిది ఏమీ లేదని.. కొత్త రేషన్ కార్డుల జారీపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై ఎలాంటి ఆంక్షలు విధించలేదని.. మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని వివరణ ఇచ్చింది. మీ సేవ ద్వారానే రేషన్ కార్డుల్లో పేర్ల చేర్పులు, మార్పులు చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. కానీ అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లను మాత్రం చేయలేదు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు కోసం ప్రజలు మీ సేవ సెంటర్కు వెళ్తే ఆ సర్వీసు అందుబాటులో లేదని చూపిస్తున్నది.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
9 ఫిబ్రవరి 2025


# కాగజ్‌నగర్‌ను మహారాష్ట్రలో కలపాలా?



మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అభివృద్ధి గురించి భవిష్యత్తు తెలంగాణ గురించి ప్రవీణ్ కుమార్ ఆలోచనలు నా ఆలోచనలు దాదాపు ఒకే రకంగా ఉన్నాయని తెలిపారు. సిర్పూర్ కాగజ్ నగర్‌తో తనకు వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. 2006 నుంచి 2009 వరకు అక్కడ పార్టీ బలోపేతం కోసం పని చేశానని గుర్తుచేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన సిర్పూర్ కాగజ్‌నగర్ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం కోసం 400 కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన పార్టీ కార్యకర్తలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. అధికారం లేకున్నా.. అర్ధ రూపాయి డబ్బులు ఇవ్వకున్నా.. కేసీఆర్ మీద ప్రేమతో 400 కిలోమీటర్లు ప్రయాణించి హైదరాబాద్ వచ్చిన ప్రతి ఒక్క సోదర సోదరీమణునికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలుగుతామని అన్నారు. అందరికీ వెలుగునిచ్చే సూర్యుడు కూడా అప్పుడప్పుడు మబ్బుల చాటుకు వెళ్లొస్తాడని.. అలాగే కేసీఆర్ కూడా ప్రజల ఆశీర్వాదంతో తిరిగి అధికారంలోకి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. సిర్పూర్ కాగజ్ నగర్‌తో తనకు వ్యక్తిగతంగా అనుబంధం ఉన్నదని కేటీఆర్ తెలిపారు. 2006 నుంచి 2009 వరకు అక్కడ పార్టీ బలోపేతం కోసం పని చేశానని గుర్తుచేశారు. 2009లో శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పది సీట్లు మాత్రమే గెలిచినా సిర్పూర్ కాగజ్ నగర్ లో కూడా గులాబీ జెండా ఎగిరిందని అన్నారు. కాగజ్ నగర్ లో ఉన్న ప్రత్యేకమైన ప్రేమతో అక్కడ ఉన్న ఏకైక పరిశ్రమ కాగజ్‌నగర్ పేపర్ మిల్లును తెరిపించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నం చేశానని చెప్పారు. పేపర్ మిల్లును ఓపెన్ చేసేందుకు ముంబై, కలకత్తా వంటి అనేక ప్రాంతాల్లో పర్యటించి అనేక కంపెనీలను కలిసి జేకేతో మాట్లాడి పేపర్ మిల్లును తిరిగి ఓపెన్ చేయించానని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న మన పార్టీతో కలిసి నడిచేందుకు ముందుకు వచ్చిన నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కేటీఆర్ అన్నారు. తెలంగాణ సమాజం గురించి.. తెలంగాణ అభివృద్ధి గురించి భవిష్యత్తు తెలంగాణ గురించి ప్రవీణ్ కుమార్ గారి ఆలోచనలు నా ఆలోచనలు దాదాపు ఒకే రకంగా ఉన్నాయని తెలిపారు. అధికారంలో ఉన్న రేవంత్ రెడ్డి ఇచ్చిన అనేక అవకాశాలను, పదవులను వదులుకొని బహుజన అభివృద్ధి కోసం మన పార్టీలో ఆయన చేరారని పేర్కొన్నారు. కేసీఆర్‌తోనే బహుజనుల అభివృద్ధి జరుగుతుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నమ్మారని అన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో సిర్పూర్ కాగజ్ నగర్ కార్యకర్తలు పనిచేసి అద్భుతమైన ఫలితాలను సాధించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాగజ్ నగర్ లో కమిట్మెంట్ ఉన్న నాయకులు చాలామంది ఉన్నారని తెలిపారు. కాగజ్ నగర్ నియోజకవర్గంలో ఉన్న ఏడు మండలాల్లో గులాబీ జెండా ఎగరాలని ధీమా వ్యక్తం చేశారు.

# ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చావుదెబ్బ : హరీశ్‌రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 :** ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కొట్టారని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గాడిద గుడ్డు మిగిలిందని విమర్శించారు. మొన్న హర్యానా, నిన్న మహారాష్ట్ర, నేడు ఢిల్లీ ఘోర పరాజయంలో రాహుల్, రేవంత్ రెడ్డి పాత్ర అమోఘమని సెటైర్లు గుప్పించారు. ఇక్కడ హామీలు అమలు చేయకుండా, ఇతర రాష్ట్రాల్లో ప్రచారం చేసుకున్నంత మాత్రాన కాంగ్రెస్‌కు ఓట్లు పడతాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ గ్యారెంటీల నిజస్వరూపం దేశవ్యాప్తంగా బట్టబయలైందని ఆక్షేపించారు. ఢిల్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆగమాగం చేసిన కులగణన ఆ పార్టీకి బెడిసికొట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా తప్పులు ఒప్పుకొని, ప్రజలకు క్షమాపణ చెప్పి కులగణను మళ్లీ నిర్వహించాలని సూచించారు. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేసిన తర్వాత అప్పుడు ఇతర రాష్ట్రాల్లో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేసుకోవాలని హితవు పలికారు. లేదంటే రేవంత్ ఎక్కడ అడుగుపెట్టినా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీష్‌రావు హెచ్చరించారు.




# ఢిల్లీలో అవినీతి ఆప్‌ను ఊడ్చేశారు

## ఢిల్లీ ఫలితాలపై కేంద్రమంత్రి బండి వ్యాఖ్యలు

**కరీంనగర్,ఫిబ్రవరి 8 :** ఢిల్లీ ప్రజలు చీపురుతో ఆమ్ ఆద్మీ పార్టీని ఊడ్చేశారని , ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. ప్రజాస్వామ్య బద్ధమైన పాలన ఢిల్లీ ప్రజలు కోరుకున్నారని చెప్పారు. ఇక తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలు గెలవబోతున్నామని అన్నారు. తెలంగాణలో రాబోయేది బిజెపి అధికారమేనని అన్నారు. శనివారం కరీంనగర్‌లో బీజేపీ పట్టభద్రుల సంకల్పయాత్ర జరిగింది. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఈ యాత్రలో పాల్గొన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. అవినీతి, కుంభకోణాలు, జైలు పార్టీలు తమకు వద్దని ప్రజలు అనుకున్నారని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఢిల్లీలో కాషాయ జెండా ఎగురుతుందని ముందు నుంచి ఊహించిందేనని అన్నారు. మేధావివర్గం అంతా బీజేపీకి ఓటు వేశారని తెలిపారు. తెలంగాణలో కూడా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో జరుగుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మేధావివర్గం, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. శాసనసభలో ప్రజా సమస్యలపై ప్రశ్నించేది బీజేపీ ఒక్కటేనని బండి సంజయ్ పేర్కొన్నారు.

# అవినీతి కారణంగానే ఆప్ ఓటమి



## అవినీతిని సహించమని తేల్చి చెప్పిన ఢిల్లీ ప్రజలు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి 8:** అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతామని రాజకీయాల్లోకి వచ్చిన ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్.. చివరికి ఆయనే అవినీతికి చిరునామాగా మారిపోయారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అవినీతిలో మునిగిన కారణంగానే ఢిల్లీ ప్రజలు తిరస్కరించి ఓడించారని అన్నారు. చివరకు లిక్కర్ స్కామ్‌లో కూడా తేలియాడారని అన్నారు. హైదరాబాద్‌లోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతిలో కూరుకుపోతే ఏం జరుగుతుందో దిల్లీ ఫలితాలు ఉదాహరణ అని పేర్కొన్నారు. 'కేజ్రీవాల్, సిసోదియా లాంటి నేతలను దిల్లీ ప్రజలు ఓడించారు. కాంగ్రెస్ దీనస్థితి చూస్తే అందరికీ జాలి కలుగుతోంది. రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌కు ఇది ఎన్నో ఓటమో లెక్కపెట్టాలి. దిల్లీలో వరుసగా 3 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ డకౌట్ అయ్యింది. అసలు గెలవాలనే ఆలోచన కాంగ్రెస్‌కు ఎప్పుడూ ఉండదు. మోదీని, భాజపాను ఓడించాలని మాత్రమే రాహుల్‌గాంధీ ఆలోచిస్తారు. రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరగటం కాదు.. రాజ్యాంగ విలువలు పాటించాలి. కేజ్రీవాల్ నాయకత్వంలోనే దిల్లీలో లిక్కర్ స్కామ్ జరిగిందని ప్రజలు నమ్మారు. లిక్కర్ స్కామ్‌పై దిల్లీ ప్రజలు తీర్పు ఇచ్చారు.. ఇక కోర్టు తీర్పు రావాల్సి ఉంది. ఎన్ని ఉచితాలు ఇస్తామన్నా కేజ్రీవాల్‌ను ప్రజలు నమ్మలేదు. జైలు నుంచే పరిపాలన చేసిన కేజ్రీవాల్ డ్రామాలను ప్రజలు తిప్పికొట్టారు. పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని దిల్లీలో ఇకపై అభివృద్ధి జరగనుంది' అని కిషన్‌రెడ్డి అన్నారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాకు భారీ విజయాన్ని కట్టబెట్టినందుకు అక్కడి ప్రజలకు ఎంపీ ఈటల రాజేందర్ అభినందనలు తెలిపారు. కేజ్రీవాల్ పాలనలో దిల్లీ ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం బాగుపడలేదన్నారు. లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ ఇరుక్కుపోయి దిల్లీ ప్రజల పరువు తీశారన్నారు. కేజ్రీవాల్ విధానాలను దిల్లీ ప్రజలు తిరస్కరించారనే దానికి ఈ ఫలితాలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీపైన దేశ ప్రజలకు నమ్మకం లేదన్నారు. మోదీ పాలన వల్లే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రాబోయే కాలంలో తెలంగాణలో కాషాయ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# రిజల్ట్ చూసైనా కాంగ్రెస్ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలి

## మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 :** ఢిల్లీ ఎన్నికలు చూసైనా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, సీఎం రేవంత్‌రెడ్డి బుద్ధి తెచ్చుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఏబీఎన్‌తో రఘునందన్ రావు మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు దమ్ము ఉంటే 76 అసెంబ్లీ 12 పార్లమెంట్‌ల పరిధిలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదో చెప్పాలని అన్నారు. ఢిల్లీ ఎన్నికలకు కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. కేటీఆర్‌కు కాంగ్రెస్ మీద అంత ప్రేముంటే బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ పార్టీలో మెర్జ్ చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో బీజేపీ సత్తా ఏంటో తెలుస్తోందని అన్నారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసే మొహం లేని వాళ్లు మాట్లాడితే తాము స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. కేటీఆర్ గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత బెటర్ అని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో రాహుల్ గాంధీకి గాడిదగుడ్డు వచ్చిందని ఎద్దేవా చేశారు. లోకల్ బాడి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఢిల్లీ ఫలితాలే పునరావృతం అవుతాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేయబోతున్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. 27 ఏళ్ల తర్వాత అవినీతి సామ్రాజ్యం హస్తినలో కూలిందని అన్నారు. మార్పు కోసమే ఢిల్లీ ప్రజలు బీజేపీని ఆదరించారని ఉద్ఘాటించారు. తాను ఢిల్లీలో పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని తెలిపారు. దేశ రాజధానిలో మంచినీళ్లు దొరికే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష రేసులో తాను ఉండొచ్చని.. అది హై కమండ్ నిర్ణయమని చెప్పారు. రేవంత్ రెడ్డికి లోకల్ బాడి ఎన్నికల భయం పట్టుకుందని విమర్శించారు. అందుకే ముందు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు తర్వాత సర్పంచ్ ఎన్నికలు అంటున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం ఎదురు అవుతోందని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు.

# ఇది ఢిల్లీ ప్రజలకు ముమ్మాటికీ పండగ రోజే

మొదటి పేజీ తరువాయి


ఢిల్లీ ప్రజల సేవకోసమే బీజేపీ ఉన్నదని అన్నారు. ఢిల్లీ ప్రజల భవిష్యత్తు మోదీ గ్యారంటీ అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించిన విషయం తెలిసిందే. మొత్తం 70కిపైగా అసెంబ్లీ స్థానాలకు బీజేపీ48 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. మ్యాజిక్ ఫిగర్ ను దాటి 27 ఏళ్ల తర్వాత అధికారం చేపట్టబోతుంది. బిజెపి కార్యాలయంలో జరిగిన విజయోత్సాహ సభలో ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు అమిత్ షా, నడ్డాలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఢిల్లీ నేతలు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. ఆప్ అరాచకాలు.. ఆడంబరాలకు ఇది అంతం అన్నారు.. మూడోసారి లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించాం. మోదీ గ్యారంటీలను ఢిల్లీ ప్రజలు నమ్మారు.. షార్ట్ కట్ రాజకీయాలకు షాకిచ్చి ఢిల్లీ ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కార్ ను తెచ్చుకున్నారని ప్రధాని మోదీ అన్నారు. దిల్లీలో విజయం సామాన్య విజయం కాదు. వికసిత్ రాజధానిగా మార్చే అవకాశం మాకు ఇచ్చారు. దిల్లీని అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటాం. మా పార్టీపై నమ్మకం ఉంచిన దిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు. దిల్లీ ప్రజలు చూపించిన ప్రేమను అనేక రెట్లు పెంచి తిరిగిస్తాం. పదేళ్ల కష్టాలు, సమస్యల నుంచి దిల్లీకి విముక్తి లభించింది. పదేళ్లపాటు దిల్లీని అహంకారంతో పరిపాలించారని అన్నారు. ఇక నుంచి దిల్లీలో వికాస్, విజన్, విశ్వాస్ నినాదాలతో పరిపాలన. దిల్లీ విజయానికి కష్టపడిన కార్యకర్తలకు అభినందనలు. నిజమైన విజేతలు దిల్లీ ప్రజలే. అడ్డదారుల్లో వచ్చిన వారికి ప్రజలు షాక్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా 3 సార్లు మొత్తం సీట్లు మాకే ఇచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కారుపై ఇక్కడి ప్రజలు నమ్మకం ఉంచారు.



హరియాణా, మహారాష్ట్రలో కూడా గొప్ప విజయం సాధించాం అన్నారు. దిల్లీ మామూలు నగరం కాదు.. మినీ భారత్. దిల్లీలో గెలిచామంటే దేశమంతా భాజపాను దీవించినట్లే. దిల్లీ అభివృద్ధికి నాది గ్యారెంటీ. మెట్రో పనులు ముందుకెళ్లకుండా ఆప్ నేతలు అడ్డుకున్నారు. ఆయుష్మాన్ భారత్ లాభం దిల్లీ ప్రజలకు దక్కకుండా చేశారు. దిల్లీలో అభివృద్ధికి ఎవరు అడ్డు పడుతున్నారో ప్రజలు గ్రహించారు. అన్నీ ఆలోచించే ప్రజలు డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకున్నారు. దిల్లీ అభివృద్ధి కోసం పగలు, రాత్రి పనిచేస్తాం. పూర్వాంచల్ ప్రజల ప్రేమ, విశ్వాసం ఎప్పటికీ మరిచిపోలేం. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిజమైన అభివృద్ధి చూడొచ్చు. మన పనితీరు చూసే అనేక రాష్ట్రాల్లో మళ్లీ మనకే అధికారం కట్టబెట్టారు. హరియాణాలో సుపరిపాలనకు నాంది పలికాం. మహారాష్ట్ర రైతులకు అన్ని విధాలా అండగా ఉన్నాం. ఏపీలో చంద్రబాబు తన ట్రాక్ రికార్డు నిరూపించుకున్నారు. సుపరిపాలన ఫలాలు పేదలు, మధ్యతరగతి ప్రజలకు దక్కాయి. దిల్లీ మెట్రోను మొట్టమొదట మేమే ప్రారంభించాం. అనేక నగరాల్లో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నాం. దిల్లీని వాయుకాలుష్యం, పారిశుద్ధ్య సమస్యలు పీడిస్తున్నాయి. దిల్లీని సరికొత్త ఆధునిక నగరంగా మారుస్తాం' అని మోదీ హామీ ఇచ్చారు. ఇక కాంగ్రెస్ జీరోతో పోటీ పడిందని ఎద్దేవా చేశారు. రాహుల్ గతకొంతకాలంగా హిందూగా నటించే ప్రయత్నం చేసి భంగపడ్డారని అన్నారు. దిల్లీలో చరిత్రాత్మక విజయం సాధించాం. ఈ విజయం కోసం కార్యకర్తలు ఎంతో కృషి చేశారని, వారికి కృతజ్ఞతలని అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. మోదీ నేతృత్వంలో పార్టీ వరుస విజయాలు సాధిస్తోంది. దిల్లీ ప్రజలు మా పార్టీపై విశ్వాసం ఉంచారు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనూ దిల్లీ ప్రజలు మా వెంట ఉన్నారు. 7 లోక్‌సభ సీట్లలోనూ మా పార్టీని గెలిపించారు. పేదలు, బలహీనవర్గాల జీవితాల్లో మార్పు తేవడమే మోదీ లక్ష్యం. దిల్లీలో సుపరిపాలన అందించేందుకు కట్టుబడి ఉన్నాం. దిల్లీ ప్రజలు సురక్షితమైన తాగునీరు, మంచి రహదారులు కోరుకుంటున్నారు. ఆమ్‌ఆద్మీ పార్టీ.. అబద్దాలు ఆడే పరిశ్రమ లాంటిదని ఎద్దేవా చేశారు.

# అసెంబ్లీ సాక్షిగా మాదిగలను అవమానించారు

## ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ



**హైదరాబాద్, ఫిబ్రవరి 8 :** నిండు అసెంబ్లీలో కేసీఆర్ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని అణగతొక్కుతా అని అవమానిస్తే, 40 నిమిషాల ప్రసంగంలో రేవంత్ రెడ్డి ఎమ్మార్పీఎస్ పేరు తీయకుండా అవమానించారన్నారని, ఎన్నో ఏళ్లుగా సమాజానికి దూరంగా ఉన్న తనను నరేంద్ర మోదీ గుర్తించి గుండెలకు హత్తుకుని హృదయంలో పెట్టుకున్నార న్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ 2025 డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ తన 30 ఏళ్ల పోరాటంలో ప్రతి చోటా తనతో పాటే నడిచిందన్నారు. తన 30 ఏళ్ల పోరాటంలో జాతి కోసం కొన్ని రోజులు కష్టపడితే సమాజంలో జరిగే అనేక కష్టనష్టాలపై పోరాటం చేసిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు ఉందని మందకృష్ణ మాదిగ అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గం నుంచి వచ్చిన తమ ఉద్యమాన్ని గుర్తించి గుండెలకు హత్తుకున్న నరేంద్ర మోదీని, ఉద్యమానికి అడుగడుగున బాసటగా నిలిచిన సమాజానికి తాను రుణపడి ఉంటానని అన్నారు. సమావేశంలో మాజీ ఎంపీ బి.వెంకటేష్ నేత, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కప్పర ప్రసాదరావు, బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, వివిధ సంఘాల నాయకులు సాయి కృష్ణ, సుధాకర్ గండే, పిట్ట శ్రీనివాస్ రెడ్డి,పెద్దాపురం నరసింహ, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, దాసన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..







# కేజ్రీవాల్ పతనం ఓ గుణపాఠం

రాజకీయాల్లో అవినీతిని ఊడ్చేస్తానంటూ ప్రగల్భాలు పలికి ..రాజకీయంగా అందలం ఎక్కి..అవినీతిని కేరాఫ్ అడ్రస్‌గా మార్చుకున్న ఆప్ పార్టీని ఢిల్లీ ప్రజలే ఊడ్చి పడేశారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన కేజ్రీవాల్ కేవలం ప్రధాని పీఠంపై కన్నేసి ఎప్పుడైతే రాజకీయాలు మొదలు పెట్టారో అప్పుడే ఆయన పతనం ప్రారంభం అయ్యిందని చెప్పాలి. అవినీతి వ్యతిరేక రాజకీయాలు కొనసాగించివుంటు కేజ్రీవాల్ రాజకీయాల్లో వజ్రంలా నిలిచేవారు. దేశ ప్రధాని పదవి కోరుకోకుండానే వచ్చేది. రాజకీయాలకు చుక్కానిగా ఉండేవారు. కానీ ఆయన ఢిల్లీలో పాగా వేయడంతోనే ఇక తనకు ఎదురులేదన్న రీతిలో అవినీతి పంకిలంలో కూరుకు పోయారు. ఆయన మంత్రులు, అనుచరులు, ఎమ్మెల్యేలు అంతా అందులో దిగబడ్డారు. యధారాజా తథా ప్రజా..అన్న సామెతలాగా ఆయనలాగే ఆయన అనుచరగణం రాజకీయాలు నడిపింది. అవినీతి అన్నది అగ్నికణం లాంటిది. దానిని పట్టుకుని సాగాలంటే ధైర్యం కావాలి. కానీ కేజ్రీవాల్ అలాంటి ప్రయత్నాలు చేయలేదు. అందుకే పదేళ్లుగా అందలమెక్కించిన ఢిల్లీ ప్రజలు విసుగుచెంది ఊడ్చేశారు. అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరిన కేజ్రీవాల్ ఓటమిని ఇప్పుడు హజారేనే అభినందించే పరిస్థితి వచ్చింది. అవినీతికి దూరంగా ఉండాలని ఆయన పదేపదే హెచ్చరించినా కేజ్రీవాల్ పెడచెవిన పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలకు తానొక బ్రాండ్ అని ప్రచారం చేసుకున్న కేజ్రీవాల్ దానికి కట్టుబడి ఉండలేదు. అనేక అవినీతి కేసుల్లో తానూ, తన అనుయాయులు ఇక్కుకుని విలవిల్లాడుతూ..కేవలంమోడీని చూపి రాజకీయం చేశారు. అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకుని పట్టుతప్పారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారని తెలుసుకున్న ప్రజలు ఇప్పుడు ఊడ్చేశారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావానికి దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు సంచలనంగా మారిన ఆప్ ఇప్పుడు అడ్రస్ గల్లంతయ్యిందనే చెప్పాలి. ఈ ఎన్నికల్లో బిజెపి బాగా కష్టపడి పనిచేసిందనే కన్నా, ఆప్ తన సైద్ధాంతికత నుంచి తప్పుకోవడమే ఓటమికి కారనమని చెప్పుకోవాలి. ప్రజలకు ఉచిత బస్సు, ఉచిత కరెంట్, ఉచిత విద్య లాంటి నినాదాలతో మార్మోగించిన కేజ్రీవాల్ అసలు సమస్యలు పక్కన పెట్టారు. ఢిల్లీ వాతావరణ కాలుష్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మంచినీటి సరఫరాకు కారణమైన యమునా నది కాలుష్యం గురించి మాట్లాడలేదు. మోడీని, బిజెపిని విమర్శించడమే రాజకీయంగా ముందుకు సాగారు. అందుకే పదేళ్లుగా అధికారంలో ఉన్నా..లాభం లేకుండా పోయిందని ప్రజలు ఆలోచించారు. చివరకు కేజ్రీవాల్‌ను కూడా ఓడించేలా చేశారు. సిఎం అతిశీని కూడా ఓడించారు. రాజకీయాల్లో హీరియిజం ఉండాలి. శత్రువును ఎదుర్కొనే ధైర్యం ప్రదర్శించాలి. కానీ అలాంటివేవీ కేజ్రీవాల్ చేయలేదు. రాజకీయాల్లో అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న ఆప్ అనతి కాలంలోనే అవినీతి పార్టీగా ముద్ర వేసుకుంది. ఈ క్రమంలో ఢిల్లీలో ఓటమి అన్నది కేజ్రీవాల్ స్వయంకృతం. నిజాయితీగా ఢిల్లీలో పాలన చేసివుంటే ఆయన ప్రతిభ ఇనుమడించేది. ప్రజలు ఆదరించేవారు. కానీ అది వదిలిపెట్టి దేశమంతా తిరిగి, తానే ప్రధాని కావాలన్న దురాలోచనలో రాజకీయాలు చేసి చతికిలపడ్డ తీరు..భారత రాజకీయాల్లో ఓ గుణపాఠం లాంటివి. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితతో కలసి అవినీతి స్కామ్‌లో ఇరుక్కోవడం ఆయన పతనానికి నాంది పలికింది. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్బుతంగా శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇవన్నీ గమనిస్తూ వచ్చిన ప్రజలు రాజకీయాల్లో అబద్దాలుచెప్పే వ్యక్తిగా గుర్తించారు. అబద్దాలుచెప్పేవారిని ప్రజలు పెద్దగా పట్టించుకోరు. కానీ నిజాయితీగా ఉంటానంటూ అబద్దాలుచెబితే మాత్రం సహించరు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా.. అవినీతి లేనిదే కేసులు చుట్టుకోవు. మోడీని నిందించినంత మాత్రాన తన అవినీతిని కప్పిపుచ్చు కోలేరు. ఢిల్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కూడా గుణపాఠం లాంటివే. తన రాజకీయ ధోరణిని కాంగ్రెస్ మార్చుకోవాల్సి ఉంది. కుటుంబ రాజకీయాలు చేసినా, ప్రజాస్వామ్య బద్ధంగా నడుచుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు ఇకముందు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలతో దేశ ప్రధాని కావడమే లక్ష్యమన్న రీతిలో ముందుకు సాగారు. పరమపద సోపాన పటంలో పెద్దపాము మింగితే పడ్డట్లుగా కిందపడ్డారు. ఇప్పుడు ఆయన అవినీతి వ్యతిరేక మాటలు చెబితే ఇక ప్రజలు నమ్మరు. ఏం చెబితే , ఏం చేస్తే రాకీయంగా ఎదుగగలమో కొత్తగా ఆలోచించాలి. అవినీతికి సంబంధించి మాట్లాడితే ప్రజలు ఛీత్కరించే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు కేజ్రీవాల్ పతనం కూడా ఓ రాజకీయ గుణపాఠంగా చూడాలి.

# అక్రమదారులను వెనక్కి పంపితే తప్పా?

- ట్రంప్ తీరుతో మోడీని వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్
- విదేశాంగ విధానం తెలియని కాంగ్రెస్ నేతలు






**వాషింగ్టన్, ఫిబ్రవరి 8:** అమెరికాలో అక్రమంగా తిష్టవేసిన వివిధ దేశాల వారిని గుర్తించి వెనక్కి పంపించే విషయంలో అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న చర్యలపై విమర్శలు రావడం సహజం. వీరంతా వీసా తీసుకుని అక్కడ తిష్టవేసిన వారు కాదు. మెక్సికో నుంచి నదులు, పర్వతాలు దాటి అక్రమంగా చేరినవారు మాత్రమే. ఇలాంటివారికి ఆ దేశం ఎందుకు గుర్తిస్తుందన్నదే ప్రశ్న. మనదేశంలో అయితే రోహింగ్యాలు, లేదా బంగ్లాదేశీలు చేరితే మనం ఊరుకుంటాం . కానీ ఇతరదేశాలు ఊరుకోవని గుర్తించాలి. అధికారం చేపట్టిన తర్వాత, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరించ డానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్న తీరును అభినందించాల్సిందే. అక్రమంగా తిష్టవేసిన వారు ఏదేశం వారైన వెళ్ల గొట్టినప్పుడు వెళ్లకతప్పదు. దీనిని కూడా కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది. అమానుషమని గొంతు చించుకుంటోంది. మన విదేశాంగ విధానమేంటని ప్రశ్నిస్తోంది. ప్లకార్డులు పట్టుకుని పార్మలెంట్ ముందు గగ్గోలు పెడుతోంది. అమెరికా నుంచి అక్రమంగా గెంటేసి వారి జాబితాలో భారత్‌తో పాటు కెనడా, మెక్సికో, కొలంబియా, బ్రెజిల్ దేశాలకు చెందిన వారు కూడా ఉన్నారు. అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయ వలసదారులను స్వదేశానికి తిప్పి పంపిస్తున్నారు. అమెరికా మిలటరీకి చెందిన సి - 17 ప్రత్యేక విమానంలో తొలుత 104 మందిని అమృత్ సర్‌కు పంపించారు. మరో 418మందిని గుర్తించి పట్టుకున్నట్లు కూడా అమెరికా మన విదేశాంగాశాఖకు తెలిపింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఇమ్మిగ్రేషన్ ఎజెండాను నెరవేర్చడానికి సైన్యం సహాయం తీసుకుంటున్నారు. దీని కింద సైనిక విమానాల సహాయంతో ప్రజలను బహిష్కరించే పని ప్రారంభించారు. అమెరికాలో భారత్‌కు చెందిన దాదాపు 7లక్షల 25వేలకుపైగా మంది సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉంటున్నట్టు గుర్తించారు. వీరంతా మెక్సికో ద్వారా అక్రమంగా తమ దేశంలో ప్రవేశించారని, వీరివద్ద ఎలాంటి పత్రాలు లేవని తెలుసుకున్నారు. వీరిలో 18 వేల మందిని భారత్‌కు తరలించేందుకు జాబితా రూపొందించింది. ఈ విషయంలో భారత్ కూడా తమ స్పందనను తెలియజేసింది. అక్రమ వలసలకు తాము కూడా వ్యతిరేకమని స్పష్టం చేసింది. వీసా గడువు ముగిసినా సరైన పత్రాలు లేకుండా అమెరికా సహా ఎక్కడ ఉన్నా భారతీయులను వెనక్కి తీసుకొస్తామని తెలిపింది. కాగా, మెక్సికో, సాల్వెడార్ తర్వాత అమెరికాలో ఎక్కువగా ఉంటున్నది భారతీయులే అని లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ సారథ్యంలో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తిస్తున్న అధికారులు వారిని ఆయా దేశాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా భారత్‌కు ఓ విమానం బయలుదేరింది. సీ17 విమానంలో వీరిని తరలించారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇప్పటివరకు 8వేల మంది వరకు అక్రమ వలసదారులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఒక్కో వ్యక్తిపై అమెరికా దాదాపు 4వేల 675 డాలర్లు ఖర్చు చేస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు, అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దేశం నుండి బహిష్కరించాల్సిన 1.5 మిలియన్ల మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తిప్పి పంపించారు. మన పౌరుల్లో ఎవరైనా అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లయితే, వారు భారతీయ పౌరులు అయితే, స్వదేశానికి చట్టబద్ధంగా తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. చొరబాట్ల ద్వారా అక్రమంగా మరో దేశంలో ఉంటున్న వారికి చట్టబద్ధత అనేది ఉండదు. ఈ విషయం తెలిసీ కాంగ్రెస్ రాజకీయం చేయడం, విమర్శలు చేయడం కేవలం రాజకీయ ఎజెండా తప్ప మరొటి కాదు.

# ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం

**బిజెపికి అభినందనలు తెలిపిన కేజ్రీవాల్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8 :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బిజెపికే పట్టం కట్టారు. 47 సీట్లలో బిజెపి ముందంజలో ఉంది. దీంతో బిజెపికి గెలుపు ఖరారు కానుందనే సంకేతం కనిపిస్తోంది. మ-రోవైపు ఆప్ 23 సీట్లలో ఆధిక్యంలో ఉంది. ఈ నేపథ్యంలో ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ప్రజా తీర్పును అంగీకరిస్తున్నామని అన్నారు. అధికారంలోకి రానున్న బిజెపికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆ పార్టీకి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన వీడియో సందేశమిచ్చారు. 'ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పును మేము వినమ్రంగా అంగీకరిస్తున్నాం. ఈ సందర్భంగా అధికారంలోకి రానున్న బిజెపికి అభినందనలు తెలియజేస్తున్నాను. ఓటు వేసిన ప్రజలకు వారు ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని నేను ఆశిస్తున్నాను. మేము అధికారంలో ఉన్న పదేళ్లలో ఆరోగ్యం, విద్య మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో ఎన్నో పనులు చేశాం. అయితే ఇప్పుడు నిర్మాణాత్మక ప్రతిపక్షంగానే కాకుండా ప్రజల్లోనే ఉంటూ వారికి సేవ చేస్తూనే ఉంటాం. మేము అధికారం కోసం రాజకీయాల్లోకి రాలేదు. ప్రజలకు సేవ చేసే మాధ్యమంగా భావించే రాజకీయాల్లోకి వచ్చాం' అని ఆయన పేర్కొన్నారు.

# ఆప్ ఓటమి వేళ.. సచివాలయంలో ఫైళ్ల సీజ్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8 :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఘోర ఓటమి ఖాయం కావడంతో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం నుంచి ఏ ఒక్క ఫైల్ బయటకు వెళ్లొద్దని.. అన్ని రికార్డ్స్ భద్రపరచాలని ఆదేశించారు. గత పదేళ్లుగా ఆప్ అవినీతిపై బీజేపీ ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. బీజేపీ అధికారంలోకి వచ్చాక అసెంబ్లీలో కాగ్ నివేదికలు ప్రవేశ పెడతామని ఇటీవల ప్రధాని మోడీ కూడా తెలిపారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి భారీ విజయం ఖాయమైంది. 70 అసెంబ్లీ స్థానాల్లో47 స్థానాల్లో కమలం పార్టీ దూసుకుపోతోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ మూడోసారి కూడా జీరోకే పరిమితమైంది.

# మా అమ్మను గృహనిర్బంధం చేశారు


**మెహబూబా కూతురు ఇల్తిజా ఆరోపణ**



**శ్రీనగర్,ఫిబ్రవరి 8 :** తనను, తన తల్లి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీలను శనివారం గృహ నిర్బంధంలో ఉంచినట్లు పిడిపి నాయకురాలు ఇల్టిజా ముఫ్తీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో వీడియోను పోస్టు చేసారు. బుధవారం సైన్యం కాల్పుల్లో మరణించిన ట్రక్ డ్రైవర్ కుటుంబాన్ని పరామర్శించడానికి పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ సోపోర్‌కు వెళ్ళాలని అనుకున్నారు. ఆమె మాట్లాడతూ 'నా తల్లిని, నన్ను గృహ నిర్బంధంలో ఉంచారు. సైన్యం వసీం మీర్‌ను కాల్చి చంపిన సోపోర్‌ను సందర్శించడానికి ఆమె వెళ్లాల్సి ఉన్నందున మా గేట్లు మూసివేశారు' అని ఇల్టిజా ముఫ్తీ ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపారు. మఖాన్ దిన్ కుటుంబాన్ని కలవడానికి నేను కథువాను సందర్శించా లనుకున్నాను. నన్ను బయటకు వెళ్లడానికి కూడా అనుమతించడం లేదు. ఎన్నికల తర్వాత కూడా కాశ్మీర్‌లో ఏమీ మారలేదు. ఇప్పుడు బాధితుల కుటుంబాలను ఓదార్చడం కూడా నేరంగా పరిగణించ బడుతోందని ఆమె పేర్కొన్నారు.

# కేజ్రీవాల్‌ను ఓడించిన పర్వేశ్ వర్మ

**4,089 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి8 :** న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానంలో పర్వేశ్ వర్మ 4,089 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆప్ అధినేత, మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించారు. కాగా.. గెలుపు అనంతరం ఆయన ఓ ట్వీట్ చేశారు. హిందీలో 'జైశ్రీరామ్' అని రాసుకొచ్చారు. ప్రస్తుతంపర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ పేరు దేశ వ్యాప్తంగా సంచలనం కావడంతో ఆయన ట్వీట్ కూడా వైరల్ అవుతోంది. ఇదిలా ఉండగా.. పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మను ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి పోటీదారుగా చెబుతున్నారు. ప్రవేశ్ వర్మ 1977 నవంబర్ 7న ఢిల్లీలో జన్మించారు. ఆయన భారతీయ జనతా పార్టీ (బిజెపి) సీనియర్ నాయకుడు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి దివంగత సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. అతని తల్లి పేరు రాంప్యారి వర్మ. ప్రవేశ్ వర్మ స్వాతి సింగ్‌ను వివాహం చేసుకున్నారు. ప్రవేశ్ వర్మ తన ప్రాథమిక విద్యను ఢిల్లీ పబ్లిక్ స్కూలలో పూర్తి చేశారు. దీని తరువాత అతను కిరోరి మాల్ కళాశాల నుంచి గ్రాడ్యుయేషన్ డిగ్రీని పొందారు. అంతర్జాతీయ వ్యాపారంలో ఎంబీఏ పూర్తి చేశారు.


# ట్రంప్ ఆదేశాలకు చుక్కెదురు

**ఉద్యోగుల సెలవుపై ఆర్డర్‌కు కోర్టు బ్రేక్**




**న్యూయార్క్, ఫిబ్రవరి8 :** ప్రపంచంలోని అతిపెద్ద సహాయ సంస్థ అయిన 'అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ' లోని ఉద్యోగులను సెలవుపై పంపిస్తూ అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన సంగతి ఆదేశాలకు తాజాగా బ్రేక్ పడింది. అమెరికాలోని ఫెడరల్ న్యాయమూర్తి కార్ల్ నికోల్స్ ట్రంప్ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ట్రంప్ నిర్ణయంతో విదేశాలలోని యూఎస్‌ఏఐడీ ఉద్యోగులు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అసోసియేషన్, అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ ఉద్యోగులు వాదించారు. ఈ వాదనలతో కోర్టు ఏకీభవించింది. దీంతో ట్రంప్ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేస్తునట్లు జడ్జి పేర్కొన్నారు. అంతేకాక.. ఇప్పటికే సెలవులో ఉన్న యూఎస్‌ఏఐడీ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించారు. అంతకుముందు 'యూఎస్‌ఏఐడీని మూసివేయాలి' అంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా రాసుకొచ్చారు. యూఎస్‌ఏఐడీలో 10 వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. ఈ సంఖ్యను 300 దిగువకు తీసుకురావాలని సూచిస్తున్నారు. కేవలం 294 మంది మాత్రమే ఏజెన్సీలో పనిచేసేలా ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులోభాగంగా 30 రోజుల్లోగా వారంతా ఇళ్లకు తిరిగి వెళ్లాలని ఆదేశించారు. ఆదేశాలకు ముందు ఈ సహాయ సంస్థను తీవ్రవాద ఉన్మాదులు నడుపుతున్నారని, వాళ్లందరినీ వెళ్లగొట్టేస్తానని ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అటు డోజ్ విభాగ సారథి, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ కూడా దీనిపై మాట్లాడుతూ.. యూఎస్‌ఏఐడీ నేరగాళ్ల సంస్థ అని ఆరోపించారు. దాదాపు 120 దేశాలకు మానవతా దృక్పథంతో సహాయం చేయడానికీ, ఆ దేశాల అభివృద్ధికీ, భద్రతకూ నిధులు సమకూర్చడానికీ యూఎస్‌ఏఐడీను నెలకొల్పారు. ఈ సంస్థ వందల కోట్ల డాలర్లను సహాయంగా అందిస్తోంది.

# అధికార దాహంతోనే ఓటమి



**ముంబయి,ఫిబ్రవరి 8:** ఢిల్లీ ఎన్నికల ఫలితాలపై అన్నా హజారే స్పందించారు. అధికార దాహంతోనే మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్ హారే ఓడిపోయారని ధ్వజమెత్తారు. కేజీవ్రాల్‌పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయన్నారు. లిక్కర్ స్కామ్‌తో కేజీవ్రాల్ అప్రతిష్ఠపాలయ్యారని, అందుకే ఆప్ ను ప్రజలు ఓడించారరని దుయ్యబట్టారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి దూసుకుపోతోంది. ఇప్పటివరకు జరిగిన ఓట్ల లెక్కింపులో బిజెపి మ్యాజిక్ ఫిగర్ 36 దాటింది. తాను ఎప్పటినుంచో ఎన్నికల విషయంపై కేజీవ్రాల్ ను హెచ్చరించినా, వాటిని పెడచెవిన పెట్టారని.. దాని ఫలితమే ఇదన్నారు అన్నా హజారే. ఎన్నికల్లో పోటీ చేయడంపై పలుమార్లు హెచ్చరించాను. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థికి మంచి వ్యక్తిత్వంతో పాటు, మంచి ఆలోచనలు ఉండాలని నేను భావిస్తాను. వ్యక్తికి సంబంధించిన క్లీన్ ఇమేజ్ ఉండాలి. లేకపోతే ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఆప్ నేతలు లిక్కర్ స్కామ్, అనివీతి ఆరోపణలలో చిక్కుకున్నారు. వాటి ఫలితంగా అరవింద్ కేజీవ్రాల్ ఇమేజ్ దెబ్బతింది. అందువల్లే ఆప్ నేతలకు, కేజీవ్రాల్‌కు ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వస్తున్నాయని అన్నారు. ప్రజలకు సేవ చేయడం భగవంతుడికి సేవచేయడమేనని, అలాంటి భావన లేకుంటే ఏ పార్టీ కూడా రాణించదని అన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



- పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలి
- వంటగది, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి
- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- చిన్న బోనాల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయం తనిఖీ

**ప్రజానావ, సిరిసిల్ల:** పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉపాధ్యాయులను ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్న బోనాల లోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వసతి గృహం ఆవరణను పరిశీలించారు. అక్కడి నుంచి కిచెన్, స్టోర్ రూంకు వెళ్లి సరుకుల నాణ్యత, ఆహార పదార్థాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులు చదువుతుండగా, వెళ్లి పరిశీలించారు. సిలబస్ ఎక్కడి వరకు పూర్తి అయిందని ప్రిన్సిపాల్ ను ఆరా తీశారు. ఇప్పటికే పూర్తి అయిందని, ప్రస్తుతం రివిజన్ చేయిస్తున్నామని కలెక్టర్ దృష్టికి ప్రిన్సిపాల్ థెరిసా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపేలా సిద్ధం చేయాలని,ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ ఉపాధ్యాయినులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాజన్న సేవలో కరీంనగర్ కలెక్టర్



దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామి వారిని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా అర్చకులు స్వస్తితో స్వాగతం పలికారు. నాగిరెడ్డి మండపంలో అర్చకులు నమిలికొండ రాజేశ్వర్ శర్మ ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. వీరి వెంట ప్రొటోకాల్ ఏఈఓ జీ.అశోక్, పర్యవేక్షకులు శ్రీకాంత్ చారి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నూగురి నరేందర్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

- ప్రజానావ, వేములవాడ:

## విద్యార్థిని చితకబాదిన వార్డెన్

### ఇచ్చోడలోని గోల్డెన్ లీఫ్ స్కూల్‌లో ఘటన

**ప్రజానావ, నేరడిగొండ (ఇచ్చోడ):** మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్ వార్డెన్ విద్యార్థిని చితకబాదిన ఉదంతం ఇది. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని గోల్డెన్ లీఫ్ అనే పాఠశాలలో ముక్రాకె గ్రామానికి చెందిన విద్యార్థి 7వ తరగతి చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సంతోష్ సరిగా చదవడం లేదని హాస్టల్ వార్డెన్ నిరంజన్‌సమీపంలోని ప్లాస్టిక్ పైపుతో విచక్షణారహితంగా చితకబాదాడు. దాంతో వీపుపై వాతలు తేలాయి. విషయం తెలిసిన విద్యార్థి తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వార్డెన్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.



## 11 నుంచి స్వదేశీ మేళా

- 5వేల మందితో స్వదేశీ జాగరణ మంచ్ జాబ్ మేళా
- నేడు సైకిల్ ర్యాలీ, ఎల్లుండి 5కే రన్
- స్వదేశీ మేళా కన్వీనర్ చల్మెడ రాజేశ్వరరావు, స్వదేశీ జాగరణ మంచ్ రాష్ట్ర కన్వీనర్ సీఏ ముక్క హరీశ్ బాబు

**ప్రజానావ, కరీంనగర్:** స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 16 వరకు కరీంనగర్ లోని అంబేద్కర్ స్టేడియంలో తలపెట్టిన 'స్వదేశీ మేళా' ప్రారంభం కోసం శనివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వదేశీ మేళా బాధ్యులు చల్మెడ రాజేశ్వరరావు, ముక్క హరీశ్ బాబులు మాట్లాడుతూ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే లక్ష్యంతో స్వదేశీ మేళ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ మేళాలో దాదాపు 2 లక్షల మంది పాల్గొనేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రధానంగా దేశీయ ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. 210కి పైగా స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నట్లు, ఉద్యోగాల కల్పన కోసం 120 కంపెనీలు స్వదేశీ మేళాలో స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. అలాగే 9వ తేదీన ఉదయం 6 గంటలకు కరీంనగర్లోని పలు ప్రాంతాల మీదుగా సైకిల్ ర్యాలీ,10 తేదీన 5కే రన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. స్వదేశీ మేళా ను విజయవంతం చేయాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ మేళా బాధ్యులు మాధవరావు, నిరంజనా చారి, ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, గంప వెంకట్, కళ్లెం వాసుదేవ రెడ్డి, గోపీకృష్ణ, పాక సత్యనారాయణ, నాగమల్ల వేణుమాధవ్, పుల్లూరి సంతోష్, అభిలాష్, మునీందర్, వేద పండితులు మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజానావ, దౌల్తాబాద్:** గుండెపోటుతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి మేమున్నామంటూ తనతో పాటు చదివిన స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సూరంపల్లి గంగాధరి ప్రభాకర్ కళాకార వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఈ క్రమంలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభాకర్ పదో తరగతి (1990-2000 బ్యాచ్) స్నేహితులు బాధిత కుటుంబానికి అండగా నిలబడాలనుకున్నారు. అందరూ కలిసి రూ. 20వేలు ఆర్థికసాయం అందించడంతో పాటు తన స్నేహితుడి కుటుంబానికి అండగా నిలడడతామని పేర్కొన్నారు.

# బీసీ కులగణన తప్పుల తడక



- రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే తప్పుడు లెక్కలు ప్రకటించారు
- తిరిగి సర్వే నిర్వహించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం
- మున్నూరుకాపు సంఘం హెచ్చరిక

**ప్రజానావ, కరీంనగర్:** ప్రభుత్వం ప్రకటించిన కులగణన పూర్తిగా తప్పుల తడక అని మున్నూరు కాపు సంఘం కొండ దేవయ్య పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 30లక్షల కాపులున్నప్పటికీ, కేవలం 13 లక్షల 60వేలు మాత్రమే ఉన్నట్లుగా చూపించడం సరికాదన్నారు. 2014లో చేసిన సర్వేలో 28లక్షల మున్నూరు కాపులున్నట్లు సర్వేలు వెల్లంచడగా.. ఇప్పుడు తప్పుడు లెక్కలు చూపిస్తూ ప్రభుత్వం తన పబ్బం గడుపుకోవాలని చూస్తుందని ఆరోపించారు. అనంతరం మున్నూరుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ మాట్లాడుతూ సమగ్ర సర్వే సరిగ్గా నిర్వహించలేదని, బీసీ కులగణన పూర్తిగా తప్పని ప్రస్తుత సర్వేలో 15లక్షల మందిని తగ్గించి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలు రాజకీయంగా ఎదుగుతున్నరనే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల పట్ల వివక్ష చూపుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. సర్వే తిరిగి చేయాలని, లేదంటే ఇందిరా పార్కు వద్ద భారీ ఎత్తున ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు.

## నూతన అధ్యక్షుల నియామకం

### రాష్ట్ర అధ్యక్షురాలి చేతులమీదుగా నియామక పత్రాలు అందజేత



**ప్రజానావ, కరీంనగర్:** మహిళా కాంగ్రెస్ మండల, పట్టణ కాంగ్రెస్ నూతన అధ్యక్షులను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం నియమించారు. కరీంనగర్ అధ్యక్షురాలిగా కర్ర సత్యప్రసన్న రెడ్డి, హుజూరాబాద్ టౌన్ ఎముల పుష్పలత, జమ్మికుంట టౌన్ పూదరి రేణుక, చొప్పదండి టౌన్ గుంటి స్వరూప, చిగురుమామిడి పోలు స్వప్న, హుజూరాబాద్ పుల్ల రాధమ్మ, చొప్పదండి చిలుముల స్వప్న, తిమ్మాపూర్ రాచపల్లి సరిత, ఎండీ హసీనా, మారుపాక మంజుల, ఎన్నం రజితా రెడ్డి, కాల్వ స్వప్న కరీంనగర్ జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా, కవ్వ పద్మలను మానకొండూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించారు. వీరందరికీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ పదవులన్నీ మహిళా మెంబర్ షిప్ ఆధారంగా నియమించడం జరిగిందని, ప్రతి మహిళా అధ్యక్షురాలు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## అల్ఫోర్స్ విద్యార్థిని అదృశ్యంపై యాజమాన్యం సమాధానం చెప్పాలి

### బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్



**ప్రజానావ, కరీంనగర్:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైనట్లు రెండు రోజులుగా సామాజిక మాధ్యమాలతో పాటు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నా ఇప్పటివరకు యాజమాన్యం నుంచి సమాధానం రాలేదని, దీనిపై స్పందించాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రా ష్ట్ర అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. కరీంనగర్ సంఘం కార్యాలయంలో శనివారం జరిగి న విలేకరుల సమావేశంలో బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. అదేవిధంగా వారంరోజుల కింద అల్ఫోర్స్ స్కూల్ వావిలాలపల్లి బ్రాంచ్‌లో ఒక విద్యార్థిని టీచర్ బల్లకు వేసి కొడితే అ పిల్లాడికి కుట్లు పడిన కూడా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. దానికి సంబంధించిన వార్తలను బయటకు రాకుండా అల్ఫోర్స్ యాజమాన్యం కప్పిపుచ్చే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. గతంలో హుస్నాబాద్ అల్ఫోర్స్ స్కూల్ లో కూడ ఒక పిల్లవాడిని వాతలు వచ్చే విధంగా కొట్టారని గుర్తుచేశారు. జగిత్యాలలో విద్యార్థి అదృశ్యమై రెండు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు యాజమాన్యం నుంచి కనీస సమాచారం కూడా ఇవ్వకపోగా, విద్యార్థిని తల్లిదండ్రులపైనే దురుసుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు ఫీజుల చెల్లించి పిల్లలను చదివిస్తుంటే కన్నబిడ్డల పట్ల అల్ఫోర్స్ యాజమాన్యం ఇలా వ్యవహరించే తీరును చూసి పిల్లల తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



## బెల్లంపల్లి రేంజ్‌లోనే పులి అవాసం



**ప్రజానావ, బెల్లంపల్లి :** 10 రోజుల క్రితం కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని అటవీ ప్రాంతం నుండి మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పరిధిలో సంచరిస్తూ అడవి ప్రాంత ప్రజలను భయందోళనలకు గురిచేస్తున్నది. అటవీశాఖ అధికారి పూర్ణచందర్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఉదయం కాసిపేట మండలం వరిపేట గ్రామ సరిహద్దుల్లో పులి పాదముద్రలు గుర్తించినట్టు తెలిపారు. అటవీ సమీప పొలాల్లో పంటలు ఎలా కాపాడుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## పేకాట స్థావరంపై దాడి



**ప్రజానావ, సిర్పూర్(టీ):** మండలంలోని హుడికిలి గ్రామ శివారులో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు చేశారు. పోలీసులను చూసి కొందరు పారిపోగా, పాల్ రమేష్, ఎల్ములే సాగర్ ను అరెస్ట్‌చేశారు. మరో ఏడుగురు కిర్మిరే బాపురావు, చౌదరి సాయినాథ్, చౌదరి బంర్, చౌదరి ప్రవీణ్, కిర్మిరే నవీన్, కుర్సంగి మారుతి, చందన్ కర్ సుధాకర్ పారిపోయారని పోలీసులు తెలిపారు. ఘటన స్థలంలో రూ.800 నగదు, సెల్ ఫోన్, రెండు పేకాట సెట్స్ స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై కమలాకర్ తెలిపారు.

## ఇంటర్ విద్యపై అవగాహన



**ప్రజానావ, సిర్పూర్(టీ):** ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఇంటర్ విద్య కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సిర్పూర్ (టీ) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇంటర్ విద్యపై జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ఆసిఫ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భుపెల్లితిరుపతి, జీ రవి, కే రమేష్, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

## మాలి మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



**ప్రజానావ, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవనంలో ఆదివారం జరుగనున్న అఖిల భారతీయ మాలి మహా సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ ఏర్పాటు చేసిన మాలి మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పెట్కులే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్, పూలే గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అఖిల భారతీయ మాలీ మహా సంఘం జాతీయ అధ్యక్షులు విలాస్ రావు పాటిల్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర, జిల్లా, యువజన, మహిళా విభాగం ఎన్నికలు నిర్వహిస్తారని ఆ తర్వాత నాయిగావ్ సాతార నుండి సావిత్రిబాయి పూలే వంశానికి చెందిన డాక్టర్ దిలీప్ నేవసే పాటిల్, మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్, అఖిల భారతీయ మాలి మహా సంఘం గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ శ్యామ్ రావు పూలే, అడ్వకేట్ రాజేంద్ర మహాడోలే, కైలాస్ వాగేల, తోపాటు సత్యశోధక వివాహాలు జరిపే సత్యశోధక్ రఘునాథ్ డోక్ జాతీయ కార్యవర్గ సభ్యులు భగవంతురావు కోట్రంగే మొదలైన వారు వారి అమూల్యమైన సందేశాలను ఇస్తారన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజానావ, నేరడిగొండ:** కర్ణాటక రాష్టంలోని చిక్ మంగళూర్ జిల్లా నుంచి ప్రయాగ్ రాజ్‌లోని కుంభమేళాకు వెళ్తున్న క్రమంలో శనివారం నేరడిగొండ మండలం అరెపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారి 44పై లారీ, కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై ఎల్ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. కర్ణాటకలోని చిక్ మంగళూర్ చెందిన చంద్రశేఖర్, తన స్నేహితుడు సునీల్ అతడి భార్య సుబ్ మంగళ కలిసి కారు (కేఏ41ఎంసీ8393)లో శుక్రవారం బెంగళూరు నుంచి దైవదర్శనానికి బయలుదేరారు. నేరడిగొండ మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వెనుక నుండి వస్తున్న లారీ వేగంగా కారు ఢీ కొట్టింది. దాంతో కారు డ్రైవర్ నియంత్రణ కోల్పోయి, కుడివైపు ముందున్న రెండు కార్లను వెనుక నుండి కారు ఢీ కొట్టింది. దాంతో మొదటి కారులో ఉన్న సునీల్ అతని భార్యకు గాయాలయ్యాయి.




### బీసీ జాబితాలో

# ముస్లింలను చేర్చడం ప్రమాదం

- ఇంత అన్యాయం జరుగుతుంటే సంఘాల నోరెందుకు మూతబడ్డయ్?
- అగ్రవర్ణాలు సహా అందరూ బీసీలకు మద్దతిస్తుంటే మీరెందుకు స్పందించడం లేదు?
- కుల గణనలో బీసీల జనాభాను తగ్గించడం పెద్ద కుట్ర
- బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య ఎమ్మెల్సీ మ్యాచ్ ఫిక్సింగ్
- మోసాల కాంగ్రెస్‌కు ఢిల్లీ ప్రజలు 'గాడిద గుడ్డు' ఇచ్చారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**ప్రజానావ, కరీంనగర్:** బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడం వెనుక పెద్ద కుట్ర ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడంవల్ల భవిష్యత్తులో తెలంగాణలోని బీసీలో పోటీ చేసే స్థానాల్లో హిందూ సమాజం గెలిచే పరిస్థితి ఉండబోదని హెచ్చరించారు. గతంలో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శమన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 4 శాతం రిజర్వేషన్లను అమలు చేయడంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు గెలవాల్సిన స్థానాల్లో ముస్లింలు గెలిచారన్నారు. "ఒకవైపు కుల గణన సర్వేలో బీసీల జనాభా శాతాన్ని తగ్గించి దెబ్బతీస్తున్నారు. ఇంకోవైపు బీసీ జాబితాలో ముస్లింలను చేర్చి యావత్ హిందూ సమాజాన్నే దెబ్బతీసే ఘోరమైన కుట్ర జరుగుతోంది. మేధావులు, పట్టభద్రులు ఈ విషయంలో మౌనంగా ఉండటం సమాజానికే అరిష్టం' అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు గుణ పాఠం చెప్పాలంటే బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. మోసకారి కాంగ్రెస్ కు ఢిల్లీ ప్రజలు గాడిద గుడ్డును బహుమతిగా ఇచ్చి తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని రాంనగర్ చౌరస్తా నుంచి గీతాభవన్ చౌరస్తా వరకు "పట్టభద్రుల సంకల్ప యాత్ర" నిర్వహించారు. ఈ యాత్రకు భారీ ఎత్తున యువకులు, ఉద్యోగులు, బీజేపీ కార్యకర్తలు తరలివచ్చారు. ఈ యాత్రకు బండి సంజయ్‌తోపాటు మెదక్, ఆదిలాబాద్ ఎంపీలు రఘునందన్ రావు, గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీశ్‌బాబు, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త, ఉమ్మడి మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్య, జిల్లా అధ్యక్షులు గంగడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు తదితరులు హాజరయ్యారు.

### ఒక్కరికైనా నయాపైసా ఇచ్చారా?

'ఢిల్లీలో కాంగ్రెస్‌కు ఏం మిగిలింది.. ఢిల్లీ ప్రజలు కాంగ్రెస్‌కు ఇచ్చింది గాడిద గుడ్డు. ఇక్కడ కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి వచ్చేది గాడిద గుడ్డే. నిరుద్యోగ భృతి 4 వేల రూపాయలిస్తామన్నారు. 14 నెలలైంది. ఈ లెక్కన ప్రతి నిరుద్యోగికి 56 వేల రూపాయలు బాకీ పడింది. ఒక్కరికైనా నయాపైసా ఇచ్చారా? ఏమిచ్చారు గాడిద గుడ్డు? 18 ఏళ్లు చదివిని ప్రతి యువతికి స్కూటీ ఇస్తామన్నారు. విద్యారంగానికి బడ్జెట్ లో 15 శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. కానీ బీఆర్ఎస్ మాదిరిగానే 7 శాతం నిధులు దాటలేదు. మాట తప్పిన కాంగ్రెస్ కు పట్టభద్రులు, టీచర్లు ఇవ్వాల్సింది కూడా 'గాడిద గుడ్డే' అని బండి సంజయ్ అన్నారు.

### కేసీఆర్‌లా రేవంత్ ఐరన్ లెగ్

కేసీఆర్ మాదిరిగానే రేవంత్ రెడ్డి కూడా ఐరన్ లెగ్. వీరు ఎక్కడ ఏ పార్టీ తరపున ఎన్నికల ప్రచారం చేసినా ఆ రాష్ట్రాల్లో ఆ పార్టీలు మటాష్ అవుతున్నాయని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. 'రేవంత్ రెడ్డి హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ప్రచారం చేస్తే.. అక్కడ కాంగ్రెస్ పార్టీ మటాష్ అయ్యింది. ఇగ కేసీఆర్ కూడా అంతే.. 317 జీవోకు వ్యతిరేకంగా టీచర్ల పక్షాన నిలబడి కలబడిందెవరు? పోలీసుల లాఠీదెబ్బలు తిని జైలు పాలైంది మేం. మీ కోసం రక్తం చిందించింది మేం. ఆరోజు సీఎం, మంత్రులు సహా ఎవరూ మీకు అండగా లేరు' అని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గుర్తుచేశారు.

## ఈవీఎం రక్షణ దిశగా పటిష్టమైన చర్యలు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే




**ప్రజానావ, ఆసిఫాబాద్ :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణ దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాం వద్ద రక్షణ చర్యలు, ఈవీఎం గోదాంకు వేసిన సీళ్లు, గోదాములో భద్రపరిచిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లను భద్రపరిచిన తీరును సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల రక్షణ దిశగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భద్రత సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, సి. సి. కెమెరాలు ఎల్లవేళలా పని చేయాలని, సంబంధిత అధికాలు నిరంతరం పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు సునీల్, నాయబ్ తహసిల్దార్ శ్యామ్ లాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బడ్జెట్ ను నిరసిస్తూ అంబేద్కర్‌విగ్రహానికి వినతి

**ప్రజానావ, బెల్లంపల్లి:** కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండి చేయి చూపించారని నిరసిస్తూ శనివారం బెల్లంపల్లిలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంసీపీఐయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసుల్లేటి వెంకటేష్ మాట్లాడుతూ 50 లక్షల 65 వేల కోట్ల రూపాయల కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కనీస కేటాయింపులు లేకపోవడం అన్యాయం అని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు బడ్జెట్ రూపొందించకుండా దోపిడీ వర్గాలకు అనుకూలంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సిగ్గుచేటని అన్నారు. ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ను తెలంగాణ పట్ల వివక్షపూరిత కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి, ఆరేపల్లి రమేష్, తొగరి రాహుల్, ధోనే కృష్ణ, ఆకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
ఆదివారం
9 ఫిబ్రవరి 2025


# తెలంగాణ ప్రీమియర్ లీగ్‌కు సై




- ప్రతి జిల్లాకు రూ.కోటి డెవలప్‌మెంట్ ఫండ్
- పదెకరాల విస్తీర్ణంలో స్టేడియాల అభివృద్ధి
- మార్చిలో ఏజీఎం, హెచ్‌సీఏ అవార్డ్స్ వేడుక
- ఉప్పల్ స్టేడియంలో ఆధునీకరణ పనులు
- హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయాలను వెల్లడించిన అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు

**ప్రజానావ, హైదరాబాద్ స్పోర్ట్స్:** ప్రతిభ గల యువ క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ఈ ఏడాది తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)ను నిర్వహిస్తామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు వెల్లడించారు. అలాగే గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి కూడా హెచ్‌సీఏ కార్యవర్గం పెద్దపీట వేసింది. శనివారం ఉప్పల్ స్టేడియంలో జగన్‌మోహన్ రావు అధ్యక్షతన అపెక్స్ కౌన్సిల్ సమావేశం సుహృద్భావ వాతావరణంలో జరిగింది. ఉపాధ్యక్షుడు ఎస్.దల్జిత్ సింగ్, కార్యదర్శి ఆర్.దేవ్‌రాజ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి టీ.బసవరాజు, కౌన్సిలర్ కె.సునిల్ అగర్వాల్ ఈ సమావేశానికి హాజరయ్యారు. అపెక్స్ కౌన్సిల్‌లో సమష్టిగా తీసుకున్న నిర్ణయాలను జగన్‌మోహన్ రావు వెల్లడించారు. క్రికెట్ అభివృద్ధికి హెచ్‌సీఏ కార్యవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తోందని జగన్‌మోహన్ రావు తెలిపారు. తొలుత ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకు టీమిండియా మేనేజర్‌గా ఎంపికైన దేవ్‌రాజ్‌ను మిగిలిన అపెక్స్ కౌన్సిల్ సభ్యులు అభినందించారు. అనంతరం అపెక్స్ సమావేశం ఆరంభమైంది. 'ఐపీఎల్ అనంతరం యువ క్రికెటర్ల కోసం టీపీఎల్ నిర్వహణ పనులు ప్రారంభిస్తాం. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన ప్రతి జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి రూ.కోటి ఖర్చు చేయనున్నాం. ప్రతి ఉమ్మడి జిల్లాలో ఒక దగ్గర పది ఎకరాలు కొనుగోలు చేసి కొత్త స్టేడియాలను నిర్మిస్తాం. అంతవరకు మైదానాలను లీజుకు తీసుకుని క్రికెట్ కార్యాకలాపాలు నిర్వహిస్తాం. దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో ఇటీవల సత్తా చాటిన తెలంగాణ క్రికెటర్లను సత్కరించేందుకు వచ్చే మార్చిలో హెచ్‌సీఏ అవార్డు వేడుక చేయనున్నాం. అదే నెలలో ఏజీఎం నిర్వహిస్తాం. బీసీసీఐ నిబంధనలకు అనుగుణంగా ఉప్పల్ స్టేడియాన్ని ఆధునీకరించనున్నాం. మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయనున్నాం. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు త్వరలో టెండర్లను పిలవనున్నాం' అని జగన్‌మోహన్ రావు తెలిపారు.



## తుది జట్టులో పంత్ కష్టమేనా?

### కొత్త లెఫ్ట్‌హ్యాండర్ దొరికినట్లేనా?

**కటక్:** ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారత్ వన్డే సిరీస్‌ను ఆడుతోంది. ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఆదివారం రెండో మ్యాచ్ జరగనుంది. తొలి వన్డేలో వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్‌కు మేనేజ్‌మెంట్ తీసుకుంది. రిషభ్ పంత్‌ను బెంచ్‌కే పరిమితం చేసింది. కేఎల్‌ను కాదని అక్షర్ పటేల్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించింది. అతడు హాఫ్ సెంచరీ సాధించి ఆకట్టుకున్నాడు. కుడి–ఎడమ కాంబినేషన్ కోసమే ఇలా చేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇంగ్లండ్‌తో మిగతా వన్డేల్లోనూ.. అలాగే ఛాంపియన్స్ ట్రోఫీలో కూడా పంత్‌కు తుది జట్టులో అవకాశాలు రావడం కష్టమేనని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, మిడిలార్డర్‌లో పంత్ ఉంటే ప్రత్యర్థులు కాస్త భయపడతారని.. జట్టును గెలిపించే ఇన్నింగ్స్ ఆడటం అతడి ప్రత్యేకతంటూ మరికొందరు కొనియాడారు. ఈక్రమంలో భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "నేను ఇంగ్లండ్‌తో తొలి వన్డే మ్యాచ్‌కు ముందు.. రిషభ్‌పంత్‌ను ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలోఉంచుకొని ప్రయత్నించాలని సూచించా. టాప్ –7 బ్యాటర్లలో తప్పకుండా ఎడమచేతి వాటం ప్లేయర్లు ఉండాలి. ఇప్పుడు తొలి వన్డే తర్వాత అక్షర్ పటేల్ మంచి ఆప్షన్‌గా అనిపిస్తోంది. టెస్టుల్లోనూ అతడూ అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. వన్డేల్లోనూ స్పిన్నర్లపై ఎదురుదాడి చేస్తున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో స్పిన్ ప్రభావం చాలా ఎక్కువగా ఉండనుంది. మిడిలార్డర్‌లో అక్షర్ పటేల్ సరిపోతాడు. దీంతో బౌలింగ్ ఆప్షన్ కూడా ఉంటుంది. కేఎల్ రాహుల్ ఇటీవల మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పుడు ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో తక్కువ స్కోరుకే వెనుదిరిగినంత మాత్రాన కంగారు అవసరం లేదు. ఐసీసీ టోర్నీలోనూ ప్రధాన వికెట్ కీపర్‌గా కేఎల్‌కే అవకాశం రావచ్చు. రిషభ్ పంత్‌కు ఛాన్స్‌లు తక్కువే" అని మంజ్రేకర్ వెల్లడించాడు.

## అతిగా ప్రాక్టీస్ అక్కర్లేదు..

## ఒంటరిగా ఆలోచించు

### రోహిత్‌కు బంగర్ సూచన

**న్యూఢిల్లీ:** ఇప్పుడంతా భారత కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాటింగ్ ఫామ్‌పైనే చర్చ సాగుతోంది. గత పొట్టికప్‌లో అద్భుత ఆరంభాలను ఇచ్చిన సారథి.. ఆ తర్వాత నుంచి మాత్రం బ్యాటింగ్‌లో తడబాటుకు గురవుతున్నాడు. క్రికెట్ దిగ్గజం కపిల్‌దేవ్ కూడా రోహిత్ ఫామ్‌పై ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా భారత మాజీ కోచ్ సంజయ్ బంగర్ కీలక సూచనలు చేశాడు. మరీ ఎక్కువగా నెట్స్‌లో సాధన చేయాల్సిన అవసరం లేదన్నాడు. స్వీయ పరిశీలన చేసుకుంటే సరిపోతుందని సూచించాడు. "కెరీర్‌లో పరుగులు చేయని దశను ఇప్పుడు రోహిత్ అనుభవిస్తున్నాడు. దీని నుంచి బయటపడేందుకు అతిగా సాధన చేయాల్సిన అవసరం లేదు. దాని వల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. అందుకు బదులు రోహిత్ ఒంటరిగా కాసేపు సమయం గడపాలి. గతంలో ఆటను ఆస్వాదించిన దశను గుర్తు చేసుకోవాలి. అవసరమైతే ఆ వీడియోలను చూడాలి. అప్పుడు తన బ్యాటింగ్‌లోని లోపాలపై ఓ అవగాహనకు రావాలి. ఎక్కడ పొరపాటు చేస్తున్నాననో తెలుసుకుంటే సరిచేసుకోవడం సులువు అవుతుంది. ఇలాంటివి చేస్తే ఎక్కువగా ప్రయోజనం కలుగుతుంది. ఒక్కసారి రిథమ్‌ను అందుకొంటే చాలు. అంతేకానీ, నిరాశలో కూరుకుపోకూడదు" అని బంగర్ తెలిపాడు.



**కటక్:**
చాన్నాళ్ల తర్వాత వన్డే సిరీస్‌లో టీమ్ఇండియా! అందులో విరాట్ కోహ్లి ఆట చూడాలని ఎంతో ఆశించారు అభిమానులు. కానీ ఇంగ్లాండ్‌తో తొలి వన్డేలో ఈ స్టార్ బ్యాటర్ ఆడకపోవడంతో వారికి నిరాశ తప్పలేదు. మోకాలి నొప్పి వల్ల అతను అనూహ్యంగా నాగ్‌పుర్ మ్యాచ్‌కు దూరమయ్యాడు. మ్యాచ్ రోజు టాస్ పడే వరకు విరాట్ గాయం గురించి ఎక్కడా చర్చే లేదు. అతను ప్రాక్టీస్‌లోనూ ఇబ్బంది పడి మోకాలికి పట్టీ చుట్టుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో కోహ్లి గాయం పట్ల అభిమానుల్లో ఆందోళన వ్యక్తమైంది. కానీ ఆ గాయం మరీ ఇబ్బందికరమైందేమీ కాదని స్పష్టం చేశాడు టీమ్ఇండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్. కాబట్టి ఆదివారం కటక్‌లో జరిగే రెండో వన్డేలో విరాట్ ఆడబోతున్నట్లే. మరి కోహ్లి అందుబాటులోకి వస్తే తుది జట్టు నుంచి ఎవరు తప్పుకొంటారన్నది ఆసక్తికరం. తొలి వన్డేలో కోహ్లి ఆడినట్లయితే శ్రేయస్ అయ్యర్ బెంచ్‌కు పరిమితం అయ్యేవాడట. ఈ

## విరాట్ కోహ్లి వస్తే

# తప్పుకునేదెవరు?

విషయాన్ని శ్రేయసే స్వయంగా తెలిపాడు. అయితే నాగ్‌పుర్‌లో అతను మెరుపు అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. కాబట్టి తనపై తర్వాతి మ్యాచ్‌కు వేటు వేసే పరిస్థితి లేదు. కాబట్టి గురువారమే వన్డే అరంగేట్రం చేసిన ఓపెనర్ యశస్వి జైస్వాల్ (%ఘుంప్త్రుంజఅ జీఘఅంఘుశ్రీ%)నే పక్కన పెట్టే అవకాశముంది. తన తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌ను ఆత్మవిశ్వాసంతో ఆరంభించినప్పటికీ.. 15 పరుగులకే వెనుదిరిగాడు. శ్రేయస్ విఫలమై ఉంటే జైస్వాల్‌కు ఇంకో అవకాశం దక్కేదేమో. కానీ ఇప్పుడు అతణ్ని తప్పించడం భావ్యం కాదు. కాబట్టి అరంగేట్రం చేసిన తర్వాతి మ్యాచ్‌లోనే జైస్వాల్‌పై వేటు తప్పదు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి కెరీర్ చరమాంకంలో ఉన్నారు కాబట్టి 23 ఏళ్ల జైస్వాల్‌కు భవిష్యత్‌లో మరిన్ని అవకాశాలు లభిస్తాయనడంలో సందేహం లేదు. ఇప్పటికే టెస్టు జట్టులో కుదురుకున్న అతను.. నిలకడగా ఆడితే పరిమిత ఓవర్ల క్రికెట్లోనూ కీలక ఆటగాడిగా ఎదిగే అవకాశముంది.



# అయ్యర్‌కు సుస్థిర స్థానం లేకపోవడమేంటి?

### దిగ్గజ బ్యాటర్ రికీ పాంటింగ్

**కటక్:** శ్రేయస్ అయ్యర్‌కు భారత వన్డే, టీ20 జట్లలో సుస్థిర స్థానం లేకపోవడం పట్ల ఆస్ట్రేలియా దిగ్గజ బ్యాటర్ రికీ పాంటింగ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇంగ్లాండ్ తో తొలి వన్డేలో శ్రేయస్ 36 బంతుల్లోనే 59 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్‌కు శ్రేయస్ తుది జట్టులో ఉండాల్సింది కాదు. కోహ్లి గాయపడి మ్యాచ్‌కు దూరం కావడంతోనే తనకు అవకాశం లభించినట్లు స్వయంగా శ్రేయసే వెల్లడించాడు. ఈ నేపథ్యంలో పాంటింగ్ మాట్లాడుతూ.. "భారత జట్టుకు చాన్నాళ్లుగా శ్రేయస్ దూరంగా ఉన్నాడంటే నాకు ఆశ్చర్యం కలుగుతోంది. అతను 2023 వన్డే ప్రపంచకప్‌లో గొప్ప ప్రదర్శన చేశాడు. నిలకడగా రాణిస్తూ మిడిలార్డర్లో ఓ స్థానాన్ని తన సొంతం చేసుకున్నాడనే అనుకున్నా. అతడికి గాయమైన మాట వాస్తవం. కానీ పునరాగమనంలో దేశవాళీల్లో చక్కటి ప్రదర్శన చేశాడు" అని చెప్పాడు. ఇన్నేళ్లు దిల్లీకి కోచ్‌గా ఉన్న రికీ పాంటింగ్ ఈ ఏడాది పంజాబ్ శిక్షకుడిగా వ్యవహరించనున్న సంగతి తెలిసిందే. వేలంలో రూ.26.75 కోట్లకు అదే ఫ్రాంఛైజీకి సొంతమైన శ్రేయస్.. జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు.






# సమాధానం మీరే చెప్పాలి..

## కేసీఏ షోకాజ్ నోటీసుపై శ్రీశాంత్ ఫైర్

**తిరువంతపురం:** కేరళ క్రికెట్ అసోసియేషన్‌కు, భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌కు మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సంజు శాంసన్‌కు మద్దతుగా మాట్లాడిన శ్రీశాంత్‌కు షోకాజ్ నోటీసును కేసీఏ జారీ చేసింది. దానిపై స్పందించిన శ్రీశాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశాడు. తనపై వచ్చిన ఫిక్సింగ్ స్కాండల్ అంశాన్ని తీసుకురావాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించాడు. "భారత జట్టుకు ఆడాలనే ప్రతీ క్రికెటర్ కలకు మద్దతుగా నిలుస్తా. అంతేకానీ, వారిని అణగదొక్కేవారితో కలిసి ఉండను. న్యాయం, ధర్మం, విధిపై నాకు నమ్మకం ఉంది. కేరళ క్రికెట్ సంఘం ప్రభావంతో కీలకమైన అంశంపై చర్చ జరగదేమోననే ఆందోళన నాకుంది. ఎవరైతే నా పరువుకు భంగం కలిగేలా ప్రెస్ స్టేట్‌మెంట్‌ను విడుదల చేశారో.. వారు త్వరలోనే సమాధానం ఇవ్వాల్సిఉంటుంది. ఎప్పటికీ ప్లేయర్లకు మద్దతుగా మాట్లాడుతూనే ఉంటా" అని శ్రీశాంత్ స్పష్టం చేశాడు.

### కేసీఏ స్టేట్‌మెంట్ ఏంటంటే?

సంజు శాంసన్‌కు ఛాంపియన్స్ ట్రోఫీ స్క్వాడ్‌లో అవకాశం కల్పించకపోవడంపై భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ అసహనం వ్యక్తంచేశాడు. ఇప్పుడదే కేరళ క్రికెట్ సంఘం నోటీసు జారీ చేయడానికి కారణమైంది. "శ్రీశాంత్ ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పుడు.. కేసీఏ అధికారులు అతడికి మద్దతుగా నిలిచారు. అప్పుడు క్రిమినల్ కేసును క్వాష్ చేయడంతో ఫిక్సింగ్ కేసు నుంచి బయటపడ్డాడు. అప్పుడు మేం అతడికి సహాయమందించాం. కాబట్టి, ఇతర ప్లేయర్ల సంరక్షణ విషయం శ్రీశాంత్‌కు అవసరం లేదు" అని కేసీఏ ప్రకటనలో పేర్కొంది.

## ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్ పోరు..

### ఉపఖండం నుంచే మూడు : షోయబ్ అక్తర్



**రావల్పిండి:** కేవలం పదకొండు రోజుల్లోనే ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 19 నుంచి ఐసీసీ మెగా టోర్నీ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నీలో భారత్ ఆడే మ్యాచులన్నీ దుబాయ్ వేదికగా జరగనున్నాయి. ఎనిమిది జట్లలో సెమీస్‌కు చేరే నాలుగు టీమ్‌లపై పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ తన విశ్లేషణను వెల్లడించాడు. వన్డే ప్రపంచకప్ విజేత ఆస్ట్రేలియాను తన తొలి జాబితాలో చేర్చకపోవడం గమనార్హం. నాలుగో జట్టు ఏంటనేది వెల్లడించలేదు. ఆసీస్ ఏమైనా వైల్డ్ కార్డు ఎంట్రీతో సెమీస్‌కు చేరొచ్చేమోనని అభిప్రాయపడ్డాడు. "అఫ్గానిస్థాన్ కాస్త పరిణితి ప్రదర్శిస్తే ఆ జట్టు సెమీస్‌కు చేరడం ఖాయమే. ఇక ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్ ఉంటాయి. ఉపఖండం నుంచే మూడు టీమ్‌లు సెమీస్‌కు చేరే అవకాశాలు ఎక్కువ. ఫిబ్రవరి 23న భారత్‌పై పాక్ విజయం సాధిస్తుందని భావిస్తున్నా. మళ్లీ ఫైనల్‌లోనూ ఇరు జట్లు తలపడొచ్చు. ఇక నాలుగో టీమ్ గురించి ఇప్పుడే చెప్పలేను. ఆస్ట్రేలియా మాత్రం సెమీస్‌కు చేరడం కష్టమే" అని అక్తర్ వెల్లడించాడు.

### పాక్ జెర్సీ ఆవిష్కరణ..

### ఐసీసీ ప్రమోషనల్ వీడియో

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఆతిథ్య పాకిస్థాన్ తమ జెర్సీని ఆవిష్కరించింది. లాహోర్‌లో జరిగిన కార్యక్రమంలో పాక్ కెప్టెన్ మహమ్మద్ రిజ్వాన్, బాబర్ అజామ్, షహీన్ షా అఫ్రీది పాల్గొన్నారు. ప్రమోషనల్ వీడియోను పీసీబీ విడుదల చేసింది. ఈ వీడియోలో పాక్ పురుష క్రికెటర్లే కాకుండా.. మహిళా ప్లేయర్లు ఫాతిమా సనా, సదియా ఇక్బాల్ కూడా ఇందులో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి కూడా ఛాంపియన్స్ ట్రోఫీ అధికారిక సాంగ్‌ను రిలీజ్ చేసింది. పాకిస్థానీ ప్లేబ్యాక్ సింగర్ అతిఫ్ అస్లామ్ ఆలపించాడు. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ ఒక గ్రూప్ కాగా.. అఫ్గానిస్థాన్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మరో గ్రూప్‌లో తలపడతాయి.



## కొందరు వ్యక్తులను నమ్మి మోసపోయా..
## డబ్బు నష్టపోయా : తమన్

వరుస సినిమాలతో టాలీవుడ్‌లో రాణిస్తోన్న సంగీత దర్శకుల్లో తమన్ ఒకరు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొ న్న ఆయన కెరీర్ గురించి కీలక విషయా లు పంచుకున్నారు. ఇన్నేళ్ల కెరీర్‌లో తాను ఎన్నో విషయాలు నే ర్చుకున్నానని అన్నారు. కొందరు వ్యక్తులను నమ్మి మోసపోయిన సందర్భాలు కూడా ఉన్నాయని చెప్పారు. "జీవితంలో ప్రతిఒక్కరూ ఏదోఒక సమయంలో కొందరు వ్యక్తులను నమ్మి మోసపోతారు. నాక్కూడా అలాంటి అనుభవాలు ఉన్నాయి. ఎంతోమందిని నమ్మా. వారు నాకు వెన్నుపోటు పొడిచారు. నాముందు మంచిగా ఉండేవాళ్లు. బయటకు వెళ్లి నా గురించి చెత్తగా మాట్లాడేవారు. ఎంతో డబ్బు పోగొట్టుకున్నా. ఇలాంటి ఎన్నో ఒడుదొడుకుల నుంచి పాఠాలు నేర్చుకున్నా" అని తమన్ అన్నారు. "నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. వర్క్‌లైఫ్‌లో ఒత్తిడికి గురైనప్పుడు వెంటనే గ్రౌండ్‌లోకి అడుగుపెడతా. అదే నాకు ప్రశాంతత ఇస్తుంది. మాకంటూ ఒక స్పెషల్ టీమ్ ఉండాలని.. స్టార్ క్రికెటర్లు ఆడిన మైదానంలో ఆడాలని.. ఎన్నో ఆశలు ఉండేవి. ఆ విషయంలో ఎనిమిదేళ్ల క్రితం వరకూ బాధపడ్డా. సెలబ్రిటీ క్రికెట్ లీగ్‌లో భాగం కావడంతో ఆ బాధ కూడా తీరి పోయింది. మా టీమ్‌తో కలిసి పేరుపొందిన మైదానాల్లో మ్యాచ్‌లు ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది" అని తెలిపారు. 'ఓజీ' సినిమా గురించి మాట్లాడుతూ.. పవన్‌కల్యాణ్‌ను ఎలా చూడాలనుకుంటున్నారో ఈ సినిమాలో అలా చూస్తారని చెప్పారు. "ఇదొక న్యూక్లియర్ బాంబ్. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు. మ్యూజిక్ కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నాం" అని పేర్కొన్నారు.

# అదరగొడుతోన్న 'తండేల్'.. మొదటిరోజు కలెక్షన్స్ ఎంతంటే!



నాగచైతన్య సాయిపల్లవి నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'తండేల్'. పాటలు, డైలాగులతో భారీ అంచనాలు నెలకొల్పిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకువచ్చింది. హిట్ టాక్‌ను సొంతం చేసుకొని మంచి వసూళ్లను తన ఖాతాలో వేసుకుంటోంది. ఓవర్సీస్ బాక్సాఫీస్ వద్ద తొలిరోజు భారీ కలెక్షన్లు రాబట్టింది. విదేశాల్లో మొదటిరోజు ఈ చిత్రం 3 లక్షల 50వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలుచేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణసంస్థ ఓ పోస్టర్‌ను పంచుకుంది. 'అలలు మరింత బలపడుతున్నాయి' అని క్యాప్షన్ పెట్టింది. దీంతో త్వరలోనే హాఫ్ మిలియన్ డాలర్ల మార్క్‌ను దాటేస్తుందని అభిమానులు అనుకుంటున్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం మొదటి రోజు రూ.21కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు నిర్మాణసంస్థ తెలిపింది. బుక్‌మై షోలో 24 గంటల్లో సుమారు 2 లక్షలకు పైగా 'తండేల్' టికెట్స్ అమ్ముడయ్యాయి. అలాగే ట్రెండిం గ్‌లో కొనసాగుతున్నట్లు సంస్థ తెలిపింది. చందూ మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య, సాయిపల్లవి నటించిన ఈ సినిమాలోని భావోద్వేగ సన్నివే శాలకు ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. రా జుగా నాగచైతన్య, సత్య పాత్రలో సాయి పల్లవి జీవించేశారు. వీరి మధ్య హృద్య మైన ప్రేమని ముడిపెడుతూ, దానికి సినిమా టిక్ హంగుల్ని జోడించి తె రపైన ఆసక్తిని రేకెత్తించడంలో దర్శ కుడు విజయవంతమయ్యారు. నాయికానా యకల మధ్య కెమిస్ట్రీ, ఆ ఇద్దరి నటన, విజువల్స్, సంగీతం కలిసి సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లా యి. దీంతో మంచి వసూళ్లను సొంతం చేసుకుంటోంది.



## రియల్ లైఫ్‌కి అర్థం చెబుతున్న ఐశ్వర్య

హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'రాంబంటు' చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి.. 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమాతో మంచి ఫేమ్ తెచ్చుకుంది. ఆ తర్వాత కొన్ని చిత్రాల్లో నటించినప్పటికీ అనుకున్నంతగా గుర్తింపు రాలేదు. అయితే రీసెంట్‌గా అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో మాత్రం ఫుల్ పాపులారిటీ తెచ్చుకుంది. ఇక వెంకటేష్ హీరోగా నటించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కూడా నటించింది. ఇక దీనిని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు నిర్మించారు. అయితే ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 14న రిలీజ్ అయి.. బ్లాక్ బస్టర్ హిట్ కావడంతో పాటు కలెక్షన్ల పరంగా ట్రెండ్ సెట్ చేస్తుంది. ఇక ఈ సినిమాలో ఐశ్వర్య రాజేష్ నలుగురు పిల్లల తల్లిగా, వెంకటేష్ భార్య నటించిందన్న సంగతి తెలిసిందే. ఆమె నటనకు తెలుగు ఆడియన్స్ ఫుల్ ఫిదా అయ్యారు. ప్రస్తుతం సంక్రాంతికి వస్తున్నాం మూవీ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తుంది ఈ బ్యూటీ.. అలాగే నిత్యం సోషల్ మీడియా లోనూ యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా ఐశ్వర్య తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ లెహంగా వేసుకుని హెయిర్ లీవ్ చేసుకుని హాట్ మిర్చిలా ఫొటోస్‌కి స్టిల్ ఇచ్చింది. అంతే కాకుండా వీటికి.. 'లైఫ్ బ్యాలెన్స్ అనేది పట్టుకోవడం అండ్ వదిలేయడం పై ఆధారపడి ఉంటుంది' అనే క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్‌గా మారగా.. రెడ్ డ్రెస్‌లో హీట్ పెంచుతున్నావు ఐశ్వర్య అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.


## విజయ్‌దేవరకొండ, రష్మిక బ్రేకప్



గత కొన్నేళ్లుగా హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మికల మధ్య ఎఫైర్ నడుస్తుందనే రూమార్స్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు తమ మధ్య ఎలాంటి బంధం లేదని విజయ్ దేవరకొండ , రష్మిక క్లారిటీ ఇస్తునే ఉన్నారు. అయినప్పటికీ వీరిపై ఇలాంటి వార్తలు వస్తునే ఉన్నాయి. ఆ మధ్య విజయ్ దేవరకొండ, రష్మిక ఇద్దరూ వేర్వేరుగా ఒకే ఇంట్లో ఉంటున్న ఫొటోలను తమ సోషల్ మీడియాల్లో పోస్టు చేశారు. విజయ్ దేవర కొండ ఒక ఫోటో దిగిన బ్యాక్‌గ్రౌండ్‌లోనే .. రష్మిక కూడా ఫొటో దిగింది. బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న పిట్టగోడ రెండూ సేమ్ టు సేమ్. దీంతో వీరిద్దరు ఒకే ఇంట్లో ఉంటున్నట్టు నిర్ధారించుకున్నారు. ఇదిలా ఉంటే రష్మిక, విజయ్ దేవరకొండల మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయనే చర్చ ఇండస్ట్రీలో సాగుతోంది. దీనికి కారణం కూడా లేకపోలేదు. రష్మిక ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చేసింది. ఆ పోస్ట్‌లో నేను దయను దానితో వచ్చే ప్రతిదాన్ని ఎంచుకుంటాను. మనమందరం ఒకరికొకరు తోడుగా ఉందాం అంటూ చెప్పుకొచ్చింది. రష్మిక కాలుకు ఇటీవల గాయం అయింది. ఇటువంటి సమయంలో విజయ్ దేవరకొండ ఆమె పక్కన లేకపోవడంతోనే రష్మిక ఇలాంటి పోస్ట్ చేసిందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

## మా చిత్రానికి 'ఎ' సర్టిఫికేట్ : విశ్వక్‌సేన్

'లైలా' చిత్రానికి సెన్సార్ బోర్డు 'ఎ' సర్టిఫికేట్ ఇచ్చిందని నటుడు విశ్వక్‌సేన్ తెలిపారు. తమ చిత్రానికి ఆ సర్టిఫికేట్ ఎందుకు వచ్చిందో సినిమా విడుదలయ్యాక ప్రేక్షకులకు తెలుస్తుందని ఆయన అన్నారు. పూర్తిస్థాయిలో యూత్‌ను అలరించేలా తాము ఈ సినిమాను తెరకెక్కించామని తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సినిమా ఎంపికపై స్పందించారు. "కథల ఎంపిక విషయంలో నేను ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటా. ప్రతి సినిమాతో ఎక్కువమంది ప్రేక్షకులను అలరించాలనేది నా అభిప్రాయం. ఆమేరకు విభిన్నమైన కథలనే ఎంచుకుంటున్నా. ప్రేక్షకులు కూడా నా సినిమాలు రొటీన్‌గా ఉంటే చూడటానికి ఆసక్తి చూపించడం లేదు. దర్శకుడు రామ్ నారాయణ్ 'లైలా' కథ చెప్పినప్పుడు నేను నవ్వుతూనే ఉన్నా. తప్పకుండా ఈ సినిమా చేయాలి. ఆడియన్స్‌కు నచ్చుతుందని భావించా. కాకపోతే లేడీ గెటప్ అనేసరికి కాస్త ఆలోచించా. లేడీ గెటప్ వేయడం అంత సులభం కాదని సెట్‌కు వెళ్లాక అర్థమైంది. నా లుక్‌కు సంబంధించి ఒక టీమ్ వర్క్ చేసింది. మూడు రకాల గెటప్స్ ప్రయత్నించి.. చివరకు సినిమాలో చూస్తున్న లుక్‌ను ఫైనల్ చేశాం. వ్యాక్సింగ్ చేయించుకున్నా. గోళ్లు పెంచుకున్నా. ఆ పోర్షన్ షూట్ పూర్తయ్యేవరకూ వాటిని కత్తిరించలేదు. రెండు రోజులు ఇబ్బందిగా అనిపించింది. తర్వాత అలవాటు చేసుకున్నా" అని విశ్వక్ తెలిపారు. 'మెకానిక్ రాకీ' తర్వాత విశ్వక్ సేన్ నటించిన చిత్రమే 'లైలా'. ఇందులో ఆయన తొలిసారి లేడీ గెటప్‌లో కనిపించారు. బ్యూటీ ప్లారర్ నడిపే సోనూ మోడల్ ఉన్నట్టుండి 'లైలా'గా ఎలా మారాడు? అతడికి ఎదురైన సవాళ్లు ఏమిటి? అనే ఆసక్తికర అంశాలతో ఈ సినిమా రూపొందినట్లు తెలుస్తోంది. రామ్‌నారాయణ్ దర్శకత్వం వహించారు. ఆకాంక్షశర్మ కథానాయిక. ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 14న ఇది విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక జరగనుంది.



## ఆకట్టుకుంటున్న జాన్వీ కపూర్ పోస్ట్

అతిలోక సుందరి తనయురాలు, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మత్తెక్కించే కళ్ళతో మెస్మరైజ్ చేస్తున్న ఈ భామ రీసెంట్‌గా యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన 'దేవర' మూవీలో నటించి మెప్పించింది. ఈ సినిమాతోనే ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయింది. ఇక ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల పరంగా భారీగా వసూలు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన నటిస్తోంది. దీనిని డైరెక్టర్ బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్నారు. అలాగే నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ లేటెస్ట్ ఫొటోలతో, తన వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ బ్యూటీ పోస్ట్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. తాజాగా జాన్వీ కపూర్ ఇన్‌స్టా వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. అందులో వైట్ శారీ కట్టుకుని వివిధ భంగిమల్లో ఫొటోస్‌కి స్టిల్ ఇచ్చింది. ఇక వాటికి..'సుందరి తన సహజ ఆవాసంలో' అనే క్యాప్షన్ రాసుకొచ్చింది. దీంతో ఈ ఫొటోలు కాస్తా నెట్టింట వైరల్‌గా మారాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. కాగా జాన్వీ 'పరమ్ సుందరి' అనే మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. లవ్ స్టోరీ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా నటిస్తున్నారు. ఇక ఆ సినిమా ప్రమోషన్లలో భాగంగానే ఆ బ్యూటీ ఈ ఫొటోస్ షేర్ చేసినట్లు తెలుస్తోంది.



## టైటిల్ కోసం రాజమౌళి కసరత్తు



మహేష్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రం షూటింగ్ సైలెంట్‌గా మొదలైంది. ఇప్పటికే మహేష్ బాబు, ప్రియాంకా చోప్రాలపై ఓ కీలకమైన సన్నివేశాన్ని 5 రోజులపాటు అల్యూమినియం ఫ్యాక్టరీలో వేసిన సెట్ లో తీర్చిదిద్దారు. తదుపరి షెడ్యూల్ కూడా త్వరలోనే మొదలు కానుంది. ఈ సినిమాలోని ఓ కీలకమైన పాత్రలో నానా పటేకర్ కనిపించబోతున్నారని టాక్. ఆయనపై కూడా లుక్ టెస్ట్ నిర్వహించారని ఇన్ సైడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇందులో మహేష్ తండ్రి పాత్రకు చాలా ప్రాధాన్యం ఉందట. ఆ పాత్ర కోసం ఎవరిని ఎంచుకొంటారా? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. నానా పటేకర్‌ని తీసుకొంది మహేష్ తండ్రి పాత్ర కోసమా? కాదా? అనేది తెలియాల్సి ఉంది. మరో పక్క ఈ సినిమా టైటిల్ కోసం రాజమౌళి అన్వేషణ మొదలైంది. 'మహారాజ్' , 'గరుడ' అనే టైటిల్స్ ఈ సినిమా కోసం పరిశీలించారని టాక్ నడిచింది. ఇవి రెండూ ఇప్పుడు ఓల్డ్ టైటిళ్లు అయిపోయాయి. కాబట్టి వాటి జోలికి వెళ్లకుండా 'జనరేషన్' అనే అర్థం వచ్చేలా ఓ పాన్ వరల్డ్ టైటిల్ కోసం అన్వేషిస్తున్నారని తెలుస్తోంది. మీడియాలో ఎన్ని కథనాలు వచ్చిన రాజమౌళి అండ్ కో నుంచి ఎలాంటి స్పందన లేదు.

## ఇండియా సినిమాలకు దక్కని అవార్డులు

సినీ పరిశ్రమలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల వేడుక ఘనంగా జరిగింది. శాంటా మోనికాలోని బార్కర్ హ్యాంగర్‌లో క్రిటిక్స్ ఛాయిస్ అవార్డుల వేడుక వేదికైంది. వివిధ భాషలకు చెందిన చిత్రాలు వివిధ కేటగిరీల్లో పోటీపడగా వాటిలో కొన్ని సినిమాలు విజేతలుగా నిలిచి అవార్డులు సొంతం చేసుకున్నాయి ఈ అవార్డుల్లో సమంత, వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో వచ్చిన 'సిటడెల్ : హనీ బన్నీ' వెబ్ సిరీస్ పోటీపడింది. ఉత్తమ విదేశీ భాష సిరీస్‌ల జాబితాలో నామినేట్ అయిన 'సిటడెల్' అవార్డును గెలుచుకోలేకపోయింది. దీనిపై 'స్క్విడ్ గేమ్2' ఉత్తమ విదేశీ భాషా సిరీస్‌గా అవార్డును సొంతం చేసుకుంది. దీంతో స్క్విడ్ గేమ్ బృందానికి సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.


Printed, Published and Owned by **Adula Thirupathi,** Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street,Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO : **TELTEL/2023/87657**